


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 09-08-2025 | సంపుటి - 24 | సంచిక - 95 | రూ : 4 | పేజీలు: 8




2లో

## సైబర్ నేరాల్లో తెలంగాణకు పదో స్థానం

- ప్రభుత్వ చర్యలతో తగ్గుతున్న మోసాలు
- మొదటి మూడు స్థానాల్లో మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక

# మూసీ పునరుజ్జీవమే వరదకు పరిష్కారం



- నీటి ప్రవాహానికి అడ్డంకులు ఉండకూడదు
- నగరంలో ఎక్కడ వర్షం పడినా వరద నీరు మూసీలోకి చేరేలా అనుసంధానం జరగాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్: మూసీ పునరుజ్జీవమే వరద సమస్యకు శాశ్వత పరిష్కారమని, ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలోని వరదనీరు మూసీని చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టంచేశారు. రాజధానిలో భారీ వర్షాలు కురిసినా తట్టుకునేందుకు వీలుగా వ్యవస్థలన్నింటినీ ప్రక్షాళన చేయాలని ఆదేశించారు. వర్షాలతో నగరం అతలాకుతలం కాకుండా... జనజీవనం అస్తవ్యస్తం కాకుండా ఉండాలంటే అత్యవసరంగా శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరముందని అధికారులను అప్రమత్తం చేశారు. దిల్లీ నుంచి శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి తరువాయి 2లో



## నిండుకుండలా హుస్సేన్ సాగర్...

### నిన్న రాత్రి హైదరాబాద్ లో భారీ వర్షం

- హుస్సేన్ సాగర్ కు భారీగా వరద
- పూర్తి స్థాయికి చేరిన నీటిమట్టం

నిన్న రాత్రి హైదరాబాద్ లో భారీ వర్షం కురిసిన సంగతి తెలిసిందే. దీంతో నగరం మొత్తం వర్షపు నీరు పోటెత్తింది. ఈ క్రమంలో కూకట్ పల్లి, బేగంపేట్, ఖైరతాబాద్ వైపు నుంచి హుసేన్ సాగర్ కు భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో, హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. హుస్సేన్ సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 514 మీటర్లు కాగా... ఈ మధ్యాహ్నం నీటిమట్టం 513.63 మీటర్లకు చేరుకుంది. ప్రస్తుతం సాగర్ కు 1,234 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా... ఔట్ ఫ్లో 1,523 క్యూసెక్కులుగా ఉంది. నీటిని దిగువకు వదులుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

## 50 శాతం టారిఫ్ తర్వాత కూడా బలంగా భారత్!

- ఒకప్పుడు రష్యా నుంచి పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేసిన యూరోపియన్ యూనియన్
- ప్రస్తుతం చైనా, భారత్, టర్కీ వంటి ఆసియా దేశాలే రష్యాకు అతిపెద్ద మార్కెట్
- భారత్ కంటే చైనాపై ఈటీఆర్ దాదాపు రెండింతలు

2లో





## కదులుతున్న రైలులో మంటలు..

: ప్రయాణికుల పరుగులు.. నెల్లూరులో ఘటన

కదులుతున్న రైలులో మంటలు ఎగసిపడడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఎమర్జెన్సీ చైన్ లాగి రైలును ఆపేశారు. రైలు ఆగిన వెంటనే కిందకు దిగి పరుగులు పెట్టారు. నెల్లూరు జిల్లాలో ఈ రోజు ఉదయం

తరువాయి 2లో



2లో

## ఎస్సీఓ సదస్సుకు రండి.. మోదీకి ఆహ్వానం పలికిన చైనా

- ఈ నెలాఖరులో చైనాలో జరగనున్న ఎస్సీఓ శిఖరాగ్ర సమావేశం
- సదస్సుకు హాజరుకానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- మోదీ పర్యటనను అధికారికంగా స్వాగతించిన చైనా ప్రభుత్వం
- 2020 గల్వాన్ ఘర్షణల తర్వాత మోదీకి ఇదే తొలి చైనా పర్యటన
- సరిహద్దు వివాదంపై ఒప్పందం తర్వాత మెరుగవుతున్న సంబంధాలు



## కాళేశ్వరంలో దోచేసి.. మళ్లీ ఎదురుదాడా?

### భారాస నేతలపై మంత్రి పొంగులేటి మండిపాటు

- హనుమకొండలో లబ్ధిదారులకు 2 పడక గదుల ఇళ్ల పత్రాల అందజేత

మహబూబాబాద్: కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మించి కాంట్రాక్టర్ల నుంచి దోచేసింది కాకుండా.. న్యాయ కమిషన్ నివేదిక వచ్చాక మళ్లీ ఎదురుదాడికి దిగుతున్నారంటూ భారాస నేతలను ఉద్దేశించి రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. రాహుల్ గాంధీ ఆలోచన విధానం మేరకు తెలంగాణలో కులగణనను చేపట్టి.. బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. బిల్లును అసెంబ్లీలో ఆమోదించి.. దిల్లీకి పంపితే ఆమోదం పొందకుండా భాజపా, భారా సలు అడ్డుపడుతున్నాయని ఆరోపించారు. హనుమకొండలోని బాలసముద్రం ఏరియాలో రూ.39 కోట్లతో నిర్మించిన 592 రెండు పడక గదుల ఇళ్ల సముదాయాన్ని ఆయన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితరులతో కలిసి శుక్రవారం తరువాయి 2లో

## మొక్కు చెల్లించుకున్న అభిమానిని కలిసిన సీఎం చంద్రబాబు



ఏపీకి చంద్రబాబు సీఎం అయితే 108 దేవాలయాల్లో సంకీర్తనా గానం చేస్తానని మొక్కుకున్న గాయని వరలక్ష్మి శుక్రవారం ముఖ్యమంత్రిని కలిశారు. రాష్ట్రం విడిపోయాక ఏపీ అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం అవ్వాలనేదే తన బలమైన నమ్మకమని తెలిపారు. అందుకే చంద్రబాబు సీఎం కావాలని కోరుకుంటూ 108 దేవాలయాల్లో సంగీత కచేరీలు చేస్తానని మొక్కుకున్నట్టు సీఎంకు వివరించారు. మంగళగిరిలో పుట్టిన తాను ముంబైలో స్థిరపడ్డానని... కానీ జన్మభూమిపై మమకారాన్ని వదులుకోలేదని వరలక్ష్మి చెప్పారు. సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొక్కు చెల్లించుకునేందుకు అన్నవరం దేవస్థానంలో తొలి కచేరీ నిర్వహించానని.. ఏపీతో పాటు మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని వివిధ ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో తాను సంగీత కచేరీ నిర్వహించానని సీఎంకు చెప్పారు. చివరి కచేరీ దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించానని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా తాను నిర్వహించిన కచేరీల వివరాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కచేరీలకు సంబంధించి వరలక్ష్మి రాసుకున్న పుస్తకాన్ని చంద్రబాబు పరిశీలించి సంతకం చేశారు. తన పట్ల వరలక్ష్మి చూపిన అభిమానానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధిని కోరుకున్న వరలక్ష్మి లాంటి వాళ్లు తనకు అండగా నిలవడం, రాష్ట్రం కోసం, తన కోసం దేవుళ్లను ప్రార్ధించడం వల్లే ప్రజల అభిమానానికి, కార్యకర్తల కష్టానికి దైవ కృప తోడైందని చంద్రబాబు అన్నారు.

## సైబర్ నేరాల్లో తెలంగాణకు పదో స్థానం

హైదరాబాద్: సైబర్ నేరాల్లో తెలంగాణ రాష్ట్రం పదో స్థానంలో నిలిచింది. గత ఏడాది కంటే ఈ ఏడాది పరిస్థితి కాస్త మెరుగైంది. మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటకలు ఈ ఏడాది కూడా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఇండియన్ సైబర్‌క్రైం కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు దేశంలో నమోదైన సైబర్‌నేరాల జాబితాను విడుదల చేసింది. మిగతా రాష్ట్రాల్లో సైబర్ నేరాలు పెరుగుతుండగా తెలంగాణలో కాస్త తగ్గుముఖం పట్టడం గమనార్హం. గత ఏడాది (జనవరి నుంచి డిసెంబరు) మహారాష్ట్ర 3,03,173 నేరాలతో మొదటిస్థానంలో నిలిచింది. ఉత్తర్‌ప్రదేశ్ 3,01,057, కర్ణాటక 1,69,384, ఉత్తరాఖండ్ 1,67,892, తమిళనాడు 1,33,427, తెలంగాణ 1,23,447 సైబర్ కేసులతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈ ఏడాది దేశంలో మొదటి ఆరు నెలల్లో రికార్డుస్థాయిలో 12,47,393 సైబర్ నేరాలు నమోదయ్యాయి. అంటే గంటకు దాదాపు 288 మోసాలు జరుగుతున్నాయి. తెలంగాణలో సైబర్‌నేరాల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేకంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. నేరాల నియంత్రణలో భాగంగా నేరస్థులు ఎక్కడున్నా వెళ్లి పట్టుకోవడం, ఫిర్యాదు అందిన వెంటనే సదరు లావాదేవీని నిలిపివేయడం, ప్రజల్లో అవగాహన పెంచడం వంటి చర్యలతో రాష్ట్రంలో క్రమంలో సైబర్‌మోసాలు తగ్గుతున్నాయి.

## కాళేశ్వరంలో దోచేసి.. మళ్లీ ఎదురుదాడా?

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించారు. స్థానిక కాళోజీ కళాక్షేత్రంలో లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పదేళ్లు పాలించిన భారాస ఆరేళ్ల కిందట నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను పేదలకు అందించడంలో విఫలమైందన్నారు. తమ ప్రభుత్వం పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం 3 లక్షల ఇళ్లనిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. గ్రేటర్ వరంగల్ మేయర్ సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, సత్యశారద పాల్గొన్నారు.

**రాఖీ కట్టి.. ఇంటి పత్రం అందుకుని..**

రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారులంతా మహిళలు కావడం, శ్రావణ శుక్రవారం, వరలక్ష్మివ్రతం రోజున సొంతింటి కల నెరవేరడంతో వారంతా హర్షం వ్యక్తంచేశారు. తెల్లారితే రాఖీ పౌర్ణమి ఉండటంతో లబ్ధిదారులు వేదికపై ఇంటిపత్రం అందుకునే సందర్భంలో మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి రాఖీలు కట్టారు. తొలి ఇంటి పత్రాన్ని తెలంగాణ ఉద్యమకారిణి రహీం ఉన్నిసాకు అందించారు. ఆమె నేతలకు రాఖీ కట్టారు.

## ఆధారాలు చూపించు, లేదంటే క్షమాపణ చెప్పు: బండి సంజయ్ పై కేటీఆర్ ఫైర్

* **ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై బండి సంజయ్‌పై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం**
* **48 గంటల్లోగా క్షమాపణ చెప్పాలని గట్టిగా డిమాండ్**
* **లేకపోతే పరువునష్టం దావా వేస్తానని తీవ్ర హెచ్చరిక**
* **త్వరలోనే లీగల్ నోటీసులు పంపుతామని వెల్లడి**
* **బండికి కనీస పరిజ్ఞానం కూడా లేదంటూ ఘాటు విమర్శలు**



కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తనపై చేసిన ఆరోపణలను 48 గంటల్లోగా వెనక్కి తీసుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో బండి సంజయ్‌పై పరువునష్టం దావా వేసి కోర్టుకు ఈడుస్తానని కేటీఆర్ గట్టిగా హెచ్చరించారు. ఈ మేరకు త్వరలోనే ఆయనకు అధికారికంగా లీగల్ నోటీసులు పంపనున్నట్లు స్పష్టం చేశారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్, రాజకీయ లబ్ధి కోసమే తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలకు సంబంధించి ఒక్కటంటే ఒక్క ఆధారం ఉన్నా బయటపెట్టాలని సవాల్ విసిరారు. కేవలం తన ఢిల్లీ బాస్‌లను మెప్పించడం కోసమే బండి సంజయ్ ఇలాంటి వీధి డ్రామాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ తీరుపై కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న వ్యక్తికి ఇంటెలిజెన్స్ పనితీరుపై కనీస అవగాహన అటుంచి, సాధారణ పరిజ్ఞానం కూడా లేదు. ఆయన వ్యాఖ్యలు హద్దులు మీరుతున్నాయి" అని విమర్శించారు. "ఢిల్లీ బాస్‌ల చెప్పులు మోసినంత సులభం కాదు బాధ్యతాయుతమైన మంత్రి పదవిని నిర్వహించడం," అంటూ ఎద్దేవా చేశారు. బండి సంజయ్ చేస్తున్న అసత్య ప్రచారాలు ఆయన స్థాయిని మరింత దిగజార్చుతున్నాయని కేటీఆర్ అభిప్రాయపడ్డారు.

### ఎస్సీఓ సదస్సుకు రండి...

# మోదీకి ఆహ్వానం పలికిన చైనా..

భారత్, చైనా మధ్య సంబంధాల విషయంలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. 2020లో గల్వాన్ లోయలో జరిగిన హింసాత్మక ఘర్షణల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలిసారిగా చైనాలో పర్యటించనున్నారు. ఈ నెలాఖరులో టియాంజిన్ నగరంలో జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు వస్తున్న ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్నట్లు చైనా శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఈ ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో టియాంజిన్‌లో ఎస్సీఓ సదస్సు జరగనుంది. ఈ సమావేశానికి భారత ప్రధాని మోదీ వస్తున్న విషయాన్ని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి గువో జియాకున్ బీజింగ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ధృవీకరించారు. "ఎస్సీఓ టియాంజిన్ సదస్సు కోసం ప్రధాని మోదీ చైనాకు రావడాన్ని మేము స్వాగతిస్తున్నాం. అన్ని సభ్య దేశాల సమష్టి కృషితో ఈ సదస్సు విజయవంతమవుతుందని, ఎస్సీఓ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని విశ్వసిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. గల్వాన్ ఘర్షణల అనంతరం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దాదాపు నాలుగేళ్ల పాటు సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగాయి. అయితే, ఇటీవలే వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి గస్తీ విషయంలో ఇరు దేశాల మధ్య ఒక అంగీకారం కుదరడంతో ప్రతిష్టంభన వీడింది. ఈ సానుకూల వాతావరణంలోనే ప్రధాని మోదీ పర్యటన ఖరారైంది. 2019 తర్వాత మోదీ చైనాలో పర్యటించడం ఇదే ప్రథమం. ఈ పర్యటనకు ముందు, ఇరు దేశాల మధ్య సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చేందుకు ఉన్నత స్థాయి సమావేశాలు జరిగాయి. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఇటీవలే చైనాలో పర్యటించారు. ముఖ్యంగా, ఉగ్రవాదంపై ద్వంద్వ వైఖరిని విడనాడాలని, లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అజిత్ దోవల్ ఎస్సీఓ భద్రతా సలహాదారుల సమావేశంలో గట్టిగా నొక్కి చెప్పారు. భారత్, చైనా, రష్యా, పాకిస్థాన్ సహా మొత్తం పది దేశాలు సభ్యులుగా ఉన్న ఎస్సీఓను 2001లో స్థాపించారు. ఈసారి టియాంజిన్‌లో జరిగే సదస్సు, సంస్థ చరిత్రలోనే అతిపెద్దదిగా నిలవనుందని చైనా వెల్లడించింది. సుమారు 20 దేశాల నేతలు, 10 అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమాలలో పాల్గొననున్నారు.

## మూసీ పునరుజ్జీవమే వరదకు పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి... గురువారం రాత్రి హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షం, తలెత్తిన ఇబ్బందులు, అధిగమించేందుకు అనుసరించాల్సిన తక్షణ చర్యలపై అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని విభాగాల అధికారుల అభిప్రాయాలను తీసుకున్నారు. వరద ప్రవాహానికి అడ్డంకులు ఉన్నందునే.. నగరంలో ఈ దుస్థితి తలెత్తుతోందని అధికారులు అభిప్రాయపడ్డారు.

**అన్ని వ్యవస్థలనూ ఆధునికీకరించాలి**

''హైదరాబాద్‌లో ఇప్పుడున్న రోడ్లు, డ్రైనేజీలు 5 సెంటీమీటర్ల వర్షం పడితే తట్టుకునే పరిస్థితి లేదు. ఒక్కోసారి 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవుతోంది. హైదరాబాద్‌లో గురువారం రాత్రి కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే కొన్ని ప్రాంతాల్లో 15 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జూన్ నుంచి ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ పరిధిలో సాధారణంతో పోలిస్తే 16 శాతం వర్షపాతం ఎక్కువగా నమోదైంది. వాతావరణ మార్పులే ఇందుకు ప్రధాన కారణం. భారీ వర్షాలతో తలెత్తే విపత్కర పరిస్థితులను అధిగమించేందుకు.. విపత్తుల నివారణ, నిర్వహణ ప్రణాళికను సమర్థంగా అనుసరించాలి.

**మూసీలోకి శుద్ధి చేసిన నీరు..**

డ్రైనేజీల ద్వారా వచ్చే నీటిని ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసి.. మూసీలో స్వచ్ఛమైన నీటి ప్రవాహం ఉండేలా శాశ్వత ప్రణాళికలు ఉండాలి. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలు, ఇతర అవసరాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా వినియోగించుకునే వీలుంటుంది. వందేళ్ల పాటు మహానగరంలో వరద సమస్య పునరావృతం కాకుండా ఉండాలంటే.. మూసీ పునరుజ్జీవమే ముఖ్యం. ఈ ప్రాజెక్టును వరద నీటి నిర్వహణకు వీలుగా డిజైన్ చేయాలి. ఆ దిశగా పనులు చేపట్టాలి.

**మల్టీ లెవెల్ పార్కింగ్ జోన్**

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. ముఖ్యంగా పాతనగరంలో ఈ సమస్యను పరిష్కరించేందుకు పెడెస్ట్రియల్ జోన్‌ను ఏర్పాటు చేసి.. పార్కింగ్ సమస్యకు చెక్ పెట్టాలి. చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం, హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి ప్రాంతాల్లో మల్టీ లెవెల్ పార్కింగ్ జోన్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి" అని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్‌రాజ్, పురపాలక శాఖ కార్యదర్శి ఇలంబర్తి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### కదులుతున్న రైలులో మంటలు..

## ప్రయాణికుల పరుగులు.. నెల్లూరులో ఘటన

(మొదటిపేజీ తరువాయి)

ఘటన. ప్రయాణికులు, రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. చాప్రా నుంచి చెన్నై సెంట్రల్ వెళ్తున్న గంగాకావేరి ఎక్స్‌ప్రెస్ (12670) లో అగ్ని ప్రమాదం జరిగింది. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం చెర్లోపల్లి గేటు సమీపంలో సాంకేతిక లోపం కారణంగా ఇంజిన్ వెనుక బోగీలో మంటలు ఎగసిపడ్డాయి. దట్టమైన పొగలు వ్యాపించడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. ఎమర్జెన్సీ చైన్ లాగడంతో రైల్వే సిబ్బంది అప్రమత్తమై రైలును ఆపారు. ప్రయాణికులు కిందకు దిగి దూరంగా పరుగులు తీశారు. బ్రేక్ బైండింగ్ కారణంగా మంటలు ఎగసిపడ్డాయని గుర్తించిన సిబ్బంది.. మరమ్మతులు చేశారు. అరగంట తర్వాత రైలు తిరిగి బయలుదేరిందని సిబ్బంది తెలిపారు.

## 50 శాతం టారిఫ్ తర్వాత కూడా బలంగా భారత్!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై ఆగస్టు 27 నుంచి అదనంగా మరో 25 శాతం సుంకాన్ని విధించనున్నట్టు ప్రకటించారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలును కొనసాగిస్తున్నందుకు ఇది ప్రతీకార చర్య అని పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న 25 శాతం సుంకానికి ఇది అదనం. ఈ నిర్ణయం వాణిజ్య విధానాలపై, ముఖ్యంగా రష్యా నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటున్న దేశాలపై ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఒకప్పుడు రష్యా నుంచి యూరోపియన్ యూనియన్ అత్యధికంగా చమురు కొనుగోలు చేసేది. రష్యాపై ఆంక్షలు విధించిన తర్వాత, చైనా, భారత్, టర్కీ వంటి ఆసియా దేశాలు రష్యాకు ప్రధాన చమురు కొనుగోలుదారులుగా మారాయి. ప్రస్తుతం ఆసియానే రష్యాకు అతిపెద్ద చమురు మార్కెట్‌గా ఉంది. రష్యా నుంచి చైనా సుమారు 219.5 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనాన్ని (చమురు, గ్యాస్, బొగ్గు) దిగుమతి చేసుకుంటోంది. భారత్ 133.4 బిలియన్ డాలర్ల విలువైన ఇంధన ఉత్పత్తులను కొనుగోలు చేస్తోంది. అలాగే, రష్యా నుంచి టర్కీ దాదాపు 90.3 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోంది. అమెరికా, యూరప్ దేశాలు ఆంక్షలు విధించినప్పటికీ, రష్యా చమురు ఎగుమతుల నుంచి భారీగా ఆదాయం పొందుతోంది. కీవ్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ప్రకారం రష్యా జూన్ నెలలో చమురు అమ్మకాల ద్వారా 12.6 బిలియన్ డాలర్లు ఆర్జించింది. 2025 సంవత్సరానికి చమురు ఎగుమతుల ద్వారా 153 బిలియన్ డాలర్ల వరకు ఆదాయం పొందవచ్చని అంచనా వేస్తున్నారు. భారత ఉత్పత్తులపై ట్రంప్ 25 శాతం సుంకం విధించినప్పటికీ, చైనాతో పోలిస్తే భారత్ మెరుగైన స్థితిలో ఉంది. ట్రంప్ కొత్త వాణిజ్య విధానం ప్రకారం చైనా దిగుమతులపై 30 శాతం, వియత్నాం దిగుమతులపై 20 శాతం సుంకం విధిస్తున్నారు. దీనితో అమెరికా మార్కెట్‌లో భారత్, వియత్నాం వస్తువులు పోటీ పడే అవకాశం ఉంది. ఫిచ్ రేటింగ్స్ ప్రకారం అమెరికాలో సగటు సుంకం రేటు (ఈటీఆర్) 17 శాతానికి పెరిగింది. చైనా ఈటీఆర్ 41.4 శాతంతో అత్యధికంగా ఉంది, అదే భారత్ ఈటీఆర్ 21 శాతం మాత్రమే. భవిష్యత్తులో చైనాకు సుంకాల విషయంలో మరింత ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే, ట్రంప్ 'అమెరికా ఫస్ట్' విధానం పాత అమెరికా మిత్రదేశాలను బలహీనపరుస్తోంది. ఇది చైనాకు కొన్ని కొత్త వ్యూహాత్మక అవకాశాలను కల్పించవచ్చు.

## నెల రోజుల్లో కొత్త రైల్వేజోన్ నోటిఫికేషన్!

* **డిసెంబరు లేదా సంక్రాంతికి అపాయింటెడ్ డే?**
* **ద.మ.రైల్వే పునర్విభజన, ద.కోస్తా జోన్ ఏర్పాటు వేగవంతం**
* **కొత్త జోన్‌కి పీహెచ్‌ఓడీల నియామకం షురూ**

హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే పునర్విభజన.. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమయింది. కొత్త జోన్‌కు జూన్‌లో జీఎంగా సందీప్ మాథూర్‌ను నియమించిన రైల్వేబోర్డు ఇప్పుడు విభాగాధిపతు(పీహెచ్‌ఓడీ)ల నియామకంపై దృష్టి సారించింది. ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (పీసీఈఈ)గా ఏపీ శర్మను బుధవారం నియమించింది. కొద్దిరోజుల క్రితం ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ (పీసీఎంఈ)గా అమిత్‌గుప్తాకు పోస్టింగ్ ఇచ్చింది. ఫైనాన్స్ విభాగ అధిపతిగా తూర్పుకోస్తా జోన్‌లో పనిచేస్తున్న ఓ అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇలా వరుస నియామకాలు చేస్తోంది. మిగతా విభాగాలకు సైతం కొద్దిరోజుల్లోనే పీహెచ్‌ఓడీలను నియమించనున్నట్లు సమాచారం.

**నోటిఫికేషన్ వెలువడిన 3-4 నెలల్లో..**



పీహెచ్‌ఓడీల నియామకం పూర్తికాగానే ద.మ.రైల్వే పునర్విభజన, దక్షిణ కోస్తా కొత్తజోన్ ఏర్పాటుపై నోటిఫికేషన్ రానుంది. ఇది ఆగస్టు నెలాఖరులోగా లేదా సెప్టెంబరు తొలివారంలో వస్తుందని రైల్వే వర్గాల సమాచారం. నోటిఫికేషన్ వెలువడిన 34 నెలల్లో 'అపాయింట్‌మెంట్ డే'ను ప్రకటిస్తారని ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'కు తెలిపారు. ఆ రోజు నుంచి ద.మ., ద.కోస్తా జోన్‌ల కార్యకలాపాలు వేర్వేరుగా జరుగుతాయి. దక్షిణ కోస్తా అపాయింటెడ్ డే వచ్చే డిసెంబరులో లేదా జనవరిలో (సంక్రాంతికి) ఉండొచ్చని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు. ఆపరేషన్స్, కమర్షియల్, భద్రత, విజిలెన్స్, ఆర్పీఎఫ్, సివిల్ ఇంజినీరింగ్, కన్‌స్ట్రక్షన్స్, సిగ్నల్‌టెలికాం, పర్సనల్, స్టోర్స్ విభాగాలకు పీహెచ్‌ఓడీలను నియమించాల్సి ఉంది.

**విభజన తర్వాత..**

ద.మ.రైల్వేలోని మూడు డివిజన్లతో పాటు.. భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న తూర్పుకోస్తా జోన్‌లో కొంతభాగంతో కలిపి విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా జోన్ ఏర్పడనుంది. ద.మ.రైల్వేలో 6 డివిజన్లు మూడుకు పరిమితమవుతాయి. రాయచూరు వాడి సెక్షన్ (108 కి.మీ.): ప్రస్తుతం గుంతకల్లు డివిజన్ పరిధిలో ఉంది. సికింద్రాబాద్ డివిజన్‌కు బదిలీచేస్తూ రైల్వేబోర్డు నిర్ణయం తీసుకుంది. కర్ణాటక నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే రైళ్లకు జోన్ ఇంటర్‌ఛేంజ్ పాయింట్లు రెండు నుంచి ఒకటికి తగ్గుతాయి. యడ్లాపూర్, యెమరాస్‌లోని థర్మల్ పాయింట్లకు బొగ్గురవాణా సులభం అవుతుంది. విష్ణుపురంపగిడిపల్లి, విష్ణుపురంజాన్‌పహాడ్ (142 కి.మీ.): గుంటూరు డివిజనలో ఉన్న ఈ సెక్షన్లు సికింద్రాబాద్ డివిజన్‌కు బదిలీ అవుతుంది. సింగరేణి ప్రాంతం నుంచి విష్ణుపురం వరకు బొగ్గు రవాణా నిరంతరాయంగా కొనసాగుతుంది. కొండపల్లి మోటుమర్రి (46 కి.మీ.): సికింద్రాబాద్ నుంచి విజయవాడ డివిజన్‌కు బదిలీ అవుతుంది. కొండపల్లి నార్ల తాతారావు పవర్‌ప్లాంట్‌కు బొగ్గు రవాణా సాఫీగా జరుగుతుంది.

# ప్రజల ఆరోగ్యాలతో.. చెలగాటమాడుతున్న చికెన్ వ్యాపారి

* వ్యర్ధాల వాహనంలోనే.. కోళ్లు రవాణా
* భూదాన్ పోచంపల్లి మండలం నుంచి దిగుమతి చేసుకుంటున్న చికెన్ వ్యాపారి
* ఆ కోళ్ల మాంసం తింటే అస్వస్థత ఖాయం

**చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి:** మాంసం ప్రియులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలలో తెలంగాణ ఒకటి. మేక మాంసం ధరలు ఆకాశాన్ని అంటడంతో మాంసం ప్రియులు చికెన్ తినేందుకు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. అంతేకాకుండా చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు వారానికి రెండు పర్యాయాలకు మించి కోడి మాంసం తినే చికెన్ ప్రియులున్నారు. చిన్న చిన్న పండుగలకు, అతిధి వస్తే త్వరగా వండటానికి వీలుగా ఉండే మాంసం చికెన్.

*** ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న వ్యాపారి**

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రానికి చెందిన ఓ చికెన్ దుకాణదారుడు లాభార్జనే ధ్యేయంగా వ్యాపారం చేస్తున్నాడు. కోళ్ల వ్యర్థాలను సరఫరా చేసే వాహనంలోని డ్రమ్ములలో కోళ్లను దిగుమతి చేసుకొని, ప్రజలకు ఆ కోళ్ళ మాంసాన్ని అమ్ముతున్నాడు. ఆ మాంసాన్ని తిన్న ప్రజలకు ఏమైనా, ఆరోగ్యాలు దెబ్బతిన్నా, అవసరం లేదు ఆ వ్యాపారికి.

**వ్యర్థాల వాహనంలోనే.. కోళ్ల రవాణా**

చికెన్ దుకాణాలలో కోడి మాంసం అమ్మగా మిగిలిన కోళ్ల వ్యర్థాలను సేకరించేందుకు కొన్ని వాహనాలు చౌటుప్పల్ మండలంలో ఉన్నాయి. ఆ వాహనాల్లో వెనుక భాగంలో డ్రమ్ములను



ఏర్పాటు చేసుకొని, ప్రతి చికెన్ దుకాణం వద్దకు వెళ్లి చికెన్ వ్యర్థాలను సేకరిస్తారు. ఈ క్రమంలో చికెన్ వ్యర్థాలను సేకరించే డ్రమ్ములలోనే, ఓ చికెన్ వ్యాపారి కోళ్లను సరఫరా చేసుకుంటున్నాడు. భూదాన్ పోచంపల్లి మండలానికి చెందిన కోళ్ల ఫారం నుంచి మార్కెట్ కంటే తక్కువ ధరకు కోళ్లను విక్రయిస్తున్నాడు. ఇందులో కంపెనీకి సంబంధం లేకుండా ఆరోగ్యంగా ఉండే కోళ్లు, కంపెనీ వదిలేసిన అనారోగ్యానికి గురైన, బరువు పెరగని కోళ్లు ఉంటాయి.

*** ఈ కోడి మాంసం తింటే అస్వస్థత ఖాయం**

కోళ్ల వ్యర్థాలను సరఫరా చేసే డ్రమ్ములలో కోళ్లను తీసుకొస్తే, వ్యర్థాల వాసన, బ్యాక్టీరియా మొత్తం ఆ కోళ్లను చుట్టుకుంటుంది. అటువంటి కోడి మాంసం తింటే అస్వస్థకు గురవడం ఖాయమని వైద్యుల మాట. ఆ మాంసం తింటే చర్మవ్యాధులతో పాటు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు అవుతాయి. అస్వస్థత తో పాటు ప్రాణానికి సైతం ప్రమాదం పొంచి ఉంది.

### కోళ్ళ వ్యర్థాల వాసన తాకినా, కోళ్లు తిన్నా ప్రమాదమే



చింతకింది కాటం రాజు
మండల మెడికల్ అధికారి, చౌటుప్పల్

కోళ్ల వ్యర్థాలు తీసుకెళ్లే డ్రమ్ములలో కోళ్లను రవాణా చేయడం సబబు కాదు. చికెన్ వ్యర్థాలను రవాణా చేసే డ్రమ్ములో తీసుకొచ్చిన కోళ్ల మాంసం తిన్నా ప్రమాదమే. ఇటీవల వనస్థలిపురంలో మేక మాంసం తిని ఒక కుటుంబం అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. అలాంటి కోళ్ల మాంసం తింటే చర్మవ్యాధులు, వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, శ్వాస కోశ వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంది. కావున చికెన్ ప్రేమికులు కోళ్ల మాంసం పట్ల జాగ్రత్త వహించడం మంచిది.

## ప్రతిభ స్కూల్లో వరలక్ష్మి వ్రతం వేడుకలు



జిన్నారం, ప్రజాస్ఫూర్తి 08 : మండల కేంద్రంలో జిన్నారంలో గల స్థానిక ప్రతిభ విద్యానికేతన్ హైస్కూల్లో శుక్రవారం వరలక్ష్మి వ్రతం వేడుకలు రక్షాబంధన్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సార శ్రీనివాస్ ఆధ్వర్యంలో వరలక్ష్మి మాత ప్రత్యేక పూజ కార్యక్రమాలు విద్యార్థులు అధ్యాపక బృందం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సార శ్రీనివాస్ మాట్లాడుతూ లక్ష్మీదేవి కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

## 42 శాతం బీసీ రిజర్వేషన్, కులగణాలు పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తున్నారు

*** మాజీ వార్డు సభ్యులు కర్రె చంద్రశేఖర్**



యాదగిరిగుట్ట, ప్రజా స్ఫూర్తి : మల్లాపురం గ్రామంలో బీసీ యువత ఆధ్వర్యంలో42 శాతం బీసీ రిజర్వేషన్, కులగణాలు పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తున్నారు,బీసీ రిజర్వేషన్ ధర్నాకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ రాలేదు,ఉమ్మడి నల్గొండ జిల్లాలో సొంత నాయకులే రేవంత్ రెడ్డిని విమర్శిస్తున్నారు,కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం ఇస్తున్నవు.. ఆ మాట ఎక్కడికి పోయింది.బీసీలకు మంత్రి పదవులు కార్పొరేషన్ పదవులు ఎన్ని ఇచ్చారు అఖిల పక్ష నాయకులతో ధర్నా నిర్వహిస్తే, బీసీ రిజర్వేషన్ అమలు అయ్యేది. విమర్శించారు ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు కర్రె చంద్రశేఖర్, ఓరుగంటి శ్రీధర్ చారి, ఎండి ఇమామ్ ,మోటే శేఖర్, శిఖ రాజు గౌడ్, కర్రె శ్రీకాంత్, గవ్వల రాజు ఇండ్ల ప్రసాద్, బరిగే రాజు తదితరులు పాల్గొన్నారు

## జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ కు రాఖీ కట్టిన మహిళా న్యాయవాదులు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం కొత్తగూడెం బార్ అసోసియేషన్‌కు చెందిన మహిళా న్యాయవాదులు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ , సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్టలకి రాఖీ కట్టారు.ఈ ప్రత్యేక కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జనపరెడ్డి గోపికృష్ణ న్యాయవాది, జూనియర్ మహిళా న్యాయవాదులు ఆర్తి మక్కడ్, నకరికంటి ఉమా, యాస మౌనిక, అరుణలత, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.కలెక్టర్ జితేష్ వి. పాటిల్ , భద్రాచలం సబ్ కలెక్టర్‌కు సోదర భావంతో రాఖీ కట్టి, స్నేహానికి, భద్రతకు, బంధానికి గుర్తుగా ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు.

## అనుమతులు ఒకదానికి... నిల్వ మరొకటి

*** ఇది గుబ్బా స్టోరేజ్ వ్యవహారం**
*** కోట్లల్లో నష్టం,బయటకు రాని విషయం**
*** గుబ్బా స్టోరేజ్ యాజమాన్యం పొంతనలేని సమాధానం**



జిన్నారం(గుమ్మడిదల)08 : గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని గుబ్బా కోల్డ్ స్టోరేజ్ వ్యవహారం ఒక్కొక్కటిగా బయటకు వస్తుంది. ఒక కోల్డ్ స్టోరేజ్ లో ఇంత భారీగా మంటలు ఎగసి పడటం ఎందుకు 16గంటల వరకు మంటలు అదుపులోనికి రాకపోవడానికి కారణం ఏమిటి. అసలు గుబ్బా కోల్డ్ స్టోరేజ్ లో ఎలాంటి పదార్థాలు నిల్వ ఉన్నాయి. ఎందుకు మంటలను అదుపులోకి తీసుకు రావడానికి 16 గంటల సమయం పట్టింది. అసలు అగినప్రమాదం జరగటానికి కారణం ఏమిటి. కోల్డ్ స్టోరేజ్ లో నిల్వ ఉన్న పదార్థాల విషయ బయటకు చెప్పడానికి ఎందుకు యాజమాన్యం జంకింది. ఇలా గుబ్బా కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాదం పై ఎన్నో డౌట్స్... మరెన్నో అనుమనాలు.

*** అసలు గుబ్బా కోల్డ్ స్టోరేజ్ కి వున్న అనుమతులు ఏమిటి?**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని గుబ్బా కోల్డ్ స్టోరేజ్ కి వున్న అనుమతులు ఆరా తీయాగా స్టోరేజ్ కి విజిటేబుల్, సీడ్స్, మరియు సీ ఫుడ్ కి సంబందించిన పదార్థాలు మాత్రమే స్టోరేజ్ లో ఉంచడానికి అనుమతులు ఉన్నాయి. ఆంపుకు ప్రభుత్వం ను ది సైతం అనుమతులను పొందారు. కాని అందుకు విరుద్ధంగా కోల్డ్ స్టోరేజ్ నిర్వహణ జరుగుతుంది. కోల్డ్ స్టోరేజ్ లో అనుమతులు లేని పదార్థాలను నిర్వహణ చేస్తున్నారు. కోల్డ్ స్టోరేజలో ఇక్కడ ప్రాంతంలోని కొన్ని రసాయన పరిశ్రమల డ్రగ్స్ లను సైతం నిల్వ ఉంచారు. అంతే కాకుండా ఎలాంటి వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ ఉంచకుండా మరెన్నో రసాయనాలను నిల్వ ఉంచారు. అగ్నిప్రమాదం సంభవించిన సంయమంలో పఠాన్ చేరు డిఎస్పీ గుబ్బా స్టోరేజ్ యాజమాని కిరణ్ తో చర్చించారు. అసలు స్టోరేజ్ లో ఏమి నిల్వలు వున్నాయి. అని వివరాలు అడిగినా యాజామాన్యం స్పందించలేదు. దీనితో డిఎస్పీ సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు.

*** మాటలార్పడానికి అంత ఆలస్యమైంది ఎందుకు?**

గుబ్బా స్టోరేజ్ అగ్నిప్రమాదం మాటలు ఆర్పడానికి ఆలస్యమైంది ఎందుకు. స్టోరేజ్ లో వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ ఉంచాల్సి వున్నా కెమికల్ ఉత్పత్తులు నిల్వ ఉంచడంతో ఆగిని ప్రమాదం భారిగా జరిగింది. గుబ్బా స్టోరేజ్ లో మంటలను అర్పడానికి 16 గంటల సమయం పట్టింది. స్థిరేజ్ లో భారిగా పేలే పదార్థాలు ఉన్నాయని యాజామాన్యం చెప్పలేదు. మంటలు మండే తిరును చూసి పోలీసులు,అగ్నిమాపక అధికారులు యజామాన్యాన్ని అడిగినా యజమాన్యం మొదటగా చెప్పకపోగా అధికారులు తీవ్రంగా ప్రశ్నించడంతో సల్ఫర్, ఇతర కెమికల్ ఉందని తెలియడంతో వచ్చిన అగ్నిమాపక వాహనాలు సైతం దూరంగా వెళ్ళాయి. అందుకే మంటలను ఆర్పడానికి 16గంటల సమయం పట్టిందనే ఆరోపణలు వున్నాయి.

## కార్మికులను భ్రమలో ఉంచి దోపిడీ చేస్తున్న బుర్జువా పార్టీలు

*** సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం. సాయిబాబు**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: బుర్జువా రాజకీయ పార్టీలు కార్మికులను మభ్యపెట్టి, దోపిడీకి లోనుచేస్తున్నాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం. సాయిబాబు విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యాలయంలో జరిగిన కార్మిక విభాగం జిల్లా విస్తృత సమావేశంలో ఆయన ప్రసంగించారు.ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కే. బ్రహ్మచారి అధ్యక్షత వహించగా సాయిబాబు మాట్లాడుతూ, కేంద్ర బీజేపీ ప్రభుత్వం మత ప్రేరిత విధానాలను అడ్డుపెట్టి కార్మిక వర్గ ఐక్యతను ఛిన్నాభిన్నం చేసేందుకు యత్నిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. "కార్మికుల సమస్యలను కర్మ సిద్ధాంతంతో జోడించి ప్రభుత్వం దోపిడీని న్యాయీకరించేందుకు ప్రయత్నిస్తోంది," అని అన్నారు.పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టిస్తున్న దోపిడీకి ఎదురుగా కార్మిక వర్గం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. మార్క్సిస్టు రాజకీయ, సామాజిక, సాంస్కృతిక చైతన్యం ద్వారా కార్మిక వర్గాన్ని విప్లవ దిశగా మలచడమే సిపిఎం పార్టీ లక్ష్యమని తెలిపారు. లేబర్ కోడ్ల ద్వారా కార్మికుల్ని ఆధునిక బానిసలుగా మార్చాలని కేంద్ర బీజేపీ కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. కార్పొరేట్ ప్రయోజనాల కోసం ప్రభుత్వం శ్రామిక వర్గ హక్కులను తుంగలో తొక్కుతోందని విమర్శించారు. అమెరికన్ సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలకు మోడీ ప్రభుత్వం తల వంచిన తీరు దేశ ఆర్థిక పతనానికి దారితీస్తోందన్నారు. బిజెపి వ్యక్తిగత విశ్వాసాలు, మత కర్మకాండలు, పండుగలను రాజకీయంగా ఉపయోగించుకుంటోందని విమర్శిస్తూ, కార్మిక వర్గం ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. చివరిగా, కార్మిక వర్గం విజయవంతమైన పోరాటం కోసం ఒక శక్తివంతమైన మార్క్సిస్టు పార్టీ నిర్మాణం అవసరమని, కేంద్రరాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని సాయిబాబు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, ఎజె. రమేష్, బి. మధు, జి. పద్మ, అర్జున్, గద్దల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని అందించాలి ఎమ్మెల్యే మల్లారెడ్డి

*** చెంగిచర్లలో ఘనంగా"త్రిధ కిచెన్" ప్రారంభోత్సవం.....**

మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి ప్రజలకు నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని అందించాలని మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి అన్నారు శుక్రవారం రోజున బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచర్లలో నూతనంగా ఏర్పాటు చేసిన "త్రిధ కిచెన్" ప్రారంభోత్స కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చామకూర మల్లారెడ్డి పాల్గొని ప్రారంభోత్సవం చేశారు, ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి,బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చెంగిచెర్ల మాజీ ఉపసర్పంచ్ కొత్త రవి గౌడ్, జంట కార్పొరేషన్ల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి లు ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి,, మీసాల కృష్ణ, యూత్ నాయకులు కొత్త సాయి తేజ గౌడ్ పైళ్ల ప్రభాకర్ రెడ్డి,కిరణ్ తదితరులు పాల్గొన్నారు..

## పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: కొలన్



*** కళ్యాణ లక్ష్మి చెక్కు అందజేసిన హన్మంత్ రెడ్డి:**

ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్:అర్హులైన వారందరూ కల్యాణ లక్ష్మి పథకాన్ని వినియోగించుకోవాలని, పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం గాజులరామారం డివిజన్ శ్రీరామ్ నగర్ బేకరిగడ్డ వాసులు మధుపతి ప్రభు లింగం కుమార్తె మధుపతి సంగీతకు రూ. 1,00116 ల కల్యాణ లక్ష్మి చెక్కును బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో బహదూర్ పల్లి మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గఫ్ఫార్, ఖలీమ్, అసిఫ్, అహ్మద్ , తదితరులు పాల్గొన్నారు.

## వరద ముంపు ప్రాంతాలలో పర్యటించిన బీజేపీ నేత చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : కురిసిన భారీ వర్షానికి జీడిమెట్ల డివిజన్ పరిధి పైప్ లైన్ రోడ్ (జీడిమెట్ల)లో వర్షపు నీరు , డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని చుట్టూ పక్కల ఉన్న అపార్ట్మెంట్స్ వాసులు తెలియజేయడంతో శుక్రవారం జీడిమెట్ల డివిజన్ పరిధి పైప్ లైన్ రోడ్(జీడిమెట్ల) లో నిన్న కురిసిన భారీ వర్షానికి అపార్ట్మెంట్స్ వాసులతో కలిసి పర్యటించి సంబంధిత కుత్బుల్లాపూర్ డిప్యూటీ కమిషనర్ నర్సింహులు,జీహెచ్ఎంసీ అధికారులు , వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పరిశీలించి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమం లో ప్రభాకర్ రెడ్డి,రమణ రెడ్డి,మూర్తి,బోస్ బాబు, అనిల్ దేశయ్,నాగేందర్,సరస్వతి,అచ్చుత్ రెడ్డి,నాయుడు,రూపేష్,కౌశిక్, కృష్ణయ్య,సంతోష్,సతీష్ చక్రవర్తి,శ్రవణ్, అర్జున్ ముదిరాజ్,మహేష్,శివ తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీలు ప్రతిపక్షాల ఓట్లు గల్లంతు చేయడానికే ప్రత్యేక సమగ్ర సవరణ విధానం

* **సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు.**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: బీహార్లో ప్రతిపక్షాలు మైనార్టీల ఓట్లను గల్లంతు చేయడానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఓటు సవరణ పేరుతో స్పెషల్ ఇంసెంటివ్ రివిజన్ విధానాన్ని తీసుకొచ్చిందని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సర్ విధానానికి వ్యతిరేకంగా స్థానిక సిపిఎం కార్యాలయం నుండి ప్రదర్శనగా బయలుదేరి అమరవీరుల స్థూపం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీహార్లో అధికారంలోకి రావడం కోసం తమకు వ్యతిరేకంగా ఓట్లు పడతాయి అనుకున్న వారిని తొలగించే కుట్టలు కేంద్ర బిజెపి ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు స్వతంత్ర సంస్థగా పనిచేయాల్సిన ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రత్యేక సమగ్ర సవరణ విధానం నేడు బీహార్ రేపు భారతదేశమంతట విస్తరిస్తుందని ఆరోపించారు ఇది నకిలీ ఓటర్లను తొలగించడం మాత్రమే కాదని భారత రాజ్యాంగంలో ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఓటు హక్కును తొలగించడమేనని ఆయన అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి పౌరుడు కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని ఆయన గుర్తు చేశారు. అభ్యుదయవాదులు ప్రజాస్వామిక వాదులు భారత రాజ్యాంగాన్ని రక్షించాలని అభివృద్ధి కాముకులు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఓటు సవరణ విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ విధానం భారత రాజ్యాంగ స్ఫూర్తి అయిన ప్రజాస్వామ్యంపై దాడి తప్ప మరొకటి కాదని ఆయన అన్నారు. స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ కి వ్యతిరేకంగా సిపిఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా నేడు జరుగుతున్న ఆందోళన తొలగించిన ఓట్లను పునరుద్ధరించే వరకు కొనసాగుతుందని అలాగే కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో సిపిఎం ముందుంటుందని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య రాష్ట్ర నాయకులు రాజు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం జ్యోతి కే బ్రహ్మచారి, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్, గడ్డం స్వామి, జిలకర పద్మ, మర్మం చంద్రయ్య, భూక్య రమేష్, వీర్ల రమేష్ ,రాంబాబు, నరేష్, మోరంపూడి శ్రీనివాస్, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కల్లూరి రామన్న జన్మదిన వేడుకలు



రాజాపేట , ప్రజా స్ఫూర్తి : రాజపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజపేట మండల కేంద్రంలోని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం ముందు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతూ ఆలేరు నియోజకవర్గ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ , పట్టణ అధ్యక్షులు బెడిద వీరేశం , జలసాధన సమితి కన్వీనర్ ఎర్ర గోకుల జస్వంత్ , రాష్ట్ర మాజీ సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి , మాజీ జిల్లా ప్రజా ప్రతినిధుల ఫోరం అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్య , మాజీ సర్పంచ్ నాగిర్తి గోపాల్ రెడ్డి , సోషల్ మీడియా కన్వీనర్ గంధ మల్ల సురేష్, కుర్రారం గ్రామ శాఖ అధ్యక్షులు రేకులపల్లి మల్లారెడ్డి , మండల సీనియర్ నాయకులు గోపగాని యాదగిరి గౌడ్ , జూకంటి బాలస్వామి , నందా ఐలయ్య , మండల యువ నాయకులు గజ్జల రాజు గొడుగు రాజు , ఎర్రగుంట కిషన్ కుమార్ , గజం కర్ణాకర్ , బొడ్డు భాస్కర్ , రాగుల నవీన్ , మేడి తరుణ్ తదితరులు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి మిఠాయి పంపిణీ చేశారు. బాణాసంచా కాల్చారు.

## శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం చిన్న కొండూరు రోడ్డులోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో మహిళా భక్తులచే సామూహిక సామూహిక వరలక్ష్మి వ్రతం, కుంకుమార్చన శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో 400మంది మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం సుధాకర్ శర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పెద్ద ఎత్తున మహిళా భక్తులు దేవాలయానికి వచ్చి తమ సౌభాగ్యాన్ని కాపాడాలని భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన ప్రతి మహిళ కుటుంబానికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ ధర్మకర్తలు కామిశెట్టి చంద్రశేఖర్ గుప్త, గుర్రం వెంకటేశం, వర్కాల వెన్నెల రవి గౌడ్, తూర్పాటి నరసింహ, మహిళా భక్తులు చింతల విజయలక్ష్మి, చింతల కర్ణ, ఉప్పల కుసుమ వరలక్ష్మి వ్రత కార్యక్రమం సహకరించిన పూజా సామాగ్రి దాతలు గుర్రం విమల, వెంకటేశం, మహిళా భక్తులకు వాటర్ బాటిల్స్ దాతలు ట్రినిటీ విద్యాలయాల చైర్మన్ కే వి బి కృష్ణారావు, డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల, మహిళా భక్తులు లత, దేవరపల్లి కర్ణ నిర్మల, ఉప్పల దీపిక, కాసాని ఐలమ్మ, బద్దం స్వప్న సాధన, సింగిరెడ్డి రజిత, విశ్వనాధుల ఝాన్సీ, బొబ్బిళ్ళ యశోధ, వరగంటి మమత, బడుగు గౌరీశ్వరి, వీరమల్ల అశ్విని, చెరుకు జయలలిత, దాచేపల్లి లక్ష్మి, జెల్ల సుజాత, మన్నే శివరాణి, పెద్ది స్వాతి, సోమవారం లక్ష్మి, వనపర్తి పావని, బత్తుల లావణ్య, బాలగోని ప్రగతి, రాజపేట శ్రీలత, గంజి అనసూయ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## జీడిమెట్ల పీఎస్ లో రక్షాబంధన్ వేడుకలు



**రక్షాబంధన్ సందర్భంగా శుక్రవారం జీడిమెట్ల పోలీస్ స్టేషన్లో సీఐ గడ్డం మల్లేష్ ను కలిసి రాఖీ కడుతున్న కుత్బుల్లాపూర్ సత్ జ్ఞాన్ స్కూల్ విద్యార్థులు**

**జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) :**

## వైద్య విధాన పరిషత్ ను సెకండరీ హెల్త్ డైరెక్టరేట్ గా అప్ గ్రేడ్ చేస్తాం...

* **తెలంగాణ వైద్య విధాన పరిషత్ లో ఖాళీగా ఉన్న సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ పోస్టుల భర్తీ చేసేందుకు మంత్రి గ్రీన్ సిగ్నల్...**
* **స్వాగతించిన ప్రభుత్వ డాక్టర్ల సంఘం ప్రతినిధులు.**



అందోలు, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ వైద్య విధాన పరిషత్ ను డెరెక్టర్ సెకండరీ హెల్త్ గా త్వరలో అప్ గ్రేడ్ చేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అన్నారు.శుక్రవారం డాక్టర్ల సంఘం ప్రతినిధులతో సంగారెడ్డి లోని తన నివాసం లో మంత్రి దామోదర్ రాజనర్సింహా సమావేశమయ్యారు. వైద్య విధాన పరిషత్ ను డైరెక్టర్ సెకండరీ హెల్త్ గా అప్ గ్రేడ్ చేయడం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు దోహద పడుతుందన్నారు. ఇటీవల రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీ లలో సేవలు అందిస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్స్ లను ప్రొఫెసర్స్ గా పెద్ద ఎత్తున పదోన్నతులు కల్పించినందుకు మంత్రి దామోదర్ రాజనర్సింహా గారికి తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు . ఇది చారిత్రాత్మక నిర్ణయమన్నారు. రాష్ట్రంలోని డాక్టర్లు అంతా హర్షం వ్యక్తం చేశారని మంత్రికి అసోసిషన్ ప్రతినిధులు వెల్లడించారు . ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు . తెలంగాణ వైద్య విధాన పరిషత్ లో ఖాళీగా ఉన్న సివిల్ అసిస్టెంట్ సర్జన్ 1690 డాక్టర్ పోస్టుల భర్తీ చేసేందుకు మంత్రి దామోదర్ రాజనర్సింహా సానుకూలంగా స్పందించారు. డాక్టర్ల పోస్టుల భర్తీకీ తెలంగాణ మెడికల్ బోర్డు త్వరగా విధివిధానాలు రూపొందించాలని మంత్రి దామోదర్ ఈ సందర్భంగా ఆదేశించారు . నాన్ టీచింగ్ విభాగం లో డీమే డిఎంఈ, డిహెచ్ , టీవివీపీ లలో టైం బాండ్ ప్రమోషన్ ల భర్తీలో వయోపరిమితి పెంపు పై కామన్ నిబంధనలు రూపొందించటానికి ఎక్సపర్ట్ కమిటీ నీ నియమిస్తామన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహా. డాక్టర్ల సమస్యల పై అసోసియేషన్ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తి పై మంత్రి దామోదర్ రాజనర్సింహా సానుకూలంగా స్పందించారు . ఈ సమావేశం లో తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు డా . నరహరి , సెక్రెటరి జనరల్ డా .లాలు ప్రసాద్ , డా.రాహుఫ్ , డా.వినయ్ కుమార్, డా . గోపాల్ , డా.క్రాంతి , డా.అశోక్ , డా.రామ్ సింగ్ లు పాల్గొన్నారు .

## సింగరేణి ఎస్ అండ్ పి సి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు పాత ఖాకి యూనిఫామ్ నే కొనసాగించాలి

* **సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యుడు భూక్య రమేష్ డిమాండ్.**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:సింగరేణిలో పనిచేస్తున్న ఎస్ అండ్ పిసి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్ కు ప్రస్తుతం ధరిస్తున్న ఖాకీ యూనిఫామ్ నే కొనసాగించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యుడు భూక్య రమేష్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రకాశం స్టేడియంలో జరిగిన ఎస్ అండ్ పి సి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్ వద్ద జరిగిన సమావేశంలో భూక్య రమేష్ మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు ఖాకీ యూనిఫామ్ నే ధరిస్తున్నారని అన్నారు . ఖాకీ యూనిఫాం లో పట్ల నిజాయితీ ,నిబద్ధత, రక్షణ కలిసి ఉంటాయని ఖాకీ యూనిఫామ్ నే కొనసాగించడం వల్ల మరింత బాధ్యత పెరుగుతుందని ఆయన అన్నారు . ప్రైవేటు సెక్యూరిటీ సంస్థ బడా కాంట్రాక్టర్ ల సొంత పెత్తనాల వల్ల రంగులు మార్చి యూనిఫామ్లను అందించే పద్ధతిని విరమించుకోవాలని భూక్య రమేష్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో సింగరేణి సి అండ్ ఎండి ని త్వరలోనే కలుస్తామన్నారు. సంబంధిత అధికారులకు వినతి పత్రాన్ని అందజేసి యూనిఫామ్ నీ కాపాడుకుంటామని ఆయన అన్నారు . సింగరేణి సంస్థ మనుగడ కోసం రక్షణలో భాగంగా ఎస్ అండ్ పిసి ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు చేస్తున్న సేవలు కష్టతరంతో కూడుకున్నప్పటికీ బాధ్యత కలిగిన కార్మికులుగా కొనసాగుతున్నారని ఈ సందర్భంగా సెక్యూరిటీ గార్డులను ఆయన అభినందించారు. సింగరేణి రక్షణకు సైనికుడిగా పని చేస్తున్న ఎస్ అండ్ పి సి ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు ఖాకీ యూనిఫామ్ ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా యూనిఫామ్ని అలవెన్స్ 6000 సింగరేణి యాజమాన్యమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ,క్రాంతి ,రాజేందర్, రవి చందు ,గణేష్ ,భాస్కర్ , ఎస్ ఎన్ పి సి సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.



## ట్రినిటీలో రక్షాబంధన్ వేడుకలు

* **రాఖీలు కట్టిన చిన్నారులు**






చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి ట్రినిటీ హైస్కూల్లో రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థులు రక్షాబంధన్ పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని బాలికలు బాలురకు రాఖీ కట్టి సోదర భావం తెలియజేశారు. ఈ సందర్భంగా ట్రినిటి విద్యాసంస్థల డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి అంటే తమ సోదరులకు రాఖీ కట్టి తన ప్రేమాభిమానాలు పంచుకోవడమన్నారు. అన్నా అంటే అమ్మలో మొదటి అక్షరం నాన్నలో చివరి అక్షరము కలిపితే అన్న అవుతుందన్నారు. అన్న తమకు అమ్మ, నాన్న వలె రక్షణగా ఉంటాడని అలాగే తమ అక్కచెల్లలను ఆత్మీయంగా చూసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ విద్యా సంస్థల చైర్మన్ కే వి బి కృష్ణారావు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదం

* **జగద్గిరిగుట్ట సీఐ నర్సింహులు**

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : సామాన్య, మధ్యతరగతి ప్రజలు నివాసముండే భగత్ సింగ్ మార్గ్, శ్రీరామ్ నగర్ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని జగద్గిరిగుట్ట సీఐ నర్సింహులు అన్నారు. శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్ లో గల శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్, మల్లారెడ్డి ఆసుపత్రి లు సంయుక్తంగా ఏర్పాటు చేసిన నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని జగద్గిరిగుట్ట సీఐ నరసింహులు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు ఏ విభాగాలలో సేవలను అందిస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిఐ నరసింహులు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం బాధ్యతాయుతంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.. వైద్య శిబిరంలో జనరల్ చెకప్ లతోపాటు ఈసీజీ, కంటి, దంత తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం మందులను ఆయన పంపిణీ చేశారు. . ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ , లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు బిర్రు ఆంజనేయులు, మేడ్చల్ జిల్లా జర్నలిస్టు సంఘం అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, ట్రాపసా గ్రేటర్ కుత్బుల్లాపూర్ చైర్మన్ కోలా వెంకటేష్, అధ్యక్షులు వినోద్ జాదవ్, లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## పంచశీల పాఠశాలలో వైభవంగా రాఖీ, వరలక్ష్మీ వేడుకలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : మూసాపేట సర్కిల్ పరిధిలోని మూసాపేటలో గల పంచశీల పాఠశాలలో శుక్రవారం రాఖీ పౌర్ణమీ , వరలక్ష్మీ వ్రత పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు విద్యార్థులకు రాఖీ కట్టి నీకు నేను రక్ష నాకు నీవు రక్ష అంటు రాఖీ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పాఠశాలలో వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు.

## చేయూత పెన్షన్ దారుల సన్నాహక సభను విజయవంతం చేయాలి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఈ నెల 11న చిట్యాలలో నిర్వహించ తలపెట్టిన మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల స్థాయి చేయూత పెన్షన్ దారుల సన్నాహక సభ విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎఐసిసి ఎన్నికల హామీ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో వికలాంగులకు వెంటనే రాజకీయ రిజర్వేషన్ ప్రకటిస్తూ చట్ట సవరణ ఆర్డినెన్స్ ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు. పెన్షన్లను అందజేసి, ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సన్నాహ సభకు ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ విచ్చేస్తున్నారని, రెండు నియోజకవర్గాల నుంచి వికలాంగులు, వృద్ధులు, వితంతువులు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.

# వర్షం నీటితో పాటే.. వ్యర్థాలు వదిలిన బొటానిక్

* పరిమితికి మించి వ్యర్థ రసాయనాల ఉత్పత్తి
* పరిశ్రమ నుంచి రోజుకో వ్యర్థ రసాయనాల ట్యాంకర్





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం నుంచి మొదలు అర్ధరాత్రి దాటిన వర్షం మాత్రం ఆగలేదు. ఇదే అదునుగా భావించింది చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తాళ్ల సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని బొటానిక్ హెల్త్ కేర్ పరిశ్రమ. పరిశ్రమలోని వ్యర్థాలను ధారాళంగా వర్షపు నీటిలో వదిలింది.

*** పరిమితికి మించి.. వ్యర్థ రసాయనాల ఉత్పత్తి**

పర్యావరణానికి ఎలాంటి హాని కలుగకుండా కొన్ని రకాల మూలికలతో మానవ ఆరోగ్యానికి సంబంధించిన ఔషధాలను తయారు చేస్తామని పరిశ్రమ యాజమాన్యం అనుమతులు తీసుకుంది. అతి తక్కువ వ్యర్థాలు మాత్రమే ఉత్పత్తి అవుతాయని ఆరెంజ్ జోన్ కింద అనుమతులు తీసుకున్నారు. కానీ బొటానిక్ హెల్త్ కేర్ పరిశ్రమ యాజమాన్యం తీసుకున్న అనుమతులకు, ఉత్పత్తి చేస్తున్న వ్యర్థ రసాయనాలకు సంబంధం లేకుండా ఉంది. ఎంత మొత్తంలో ఔషధాలు తయారు చేస్తున్నారో ఏమో కానీ, వ్యర్థ రసాయనాలు మాత్రం విచ్చలవిడిగా ఉత్పత్తి అవుతున్నాయి. పరిశ్రమ చుట్టూ దుర్గంధం వెదజల్లుతూ కాలుష్యకారక పరిశ్రమను గుర్తుచేస్తుంది బొటానిక్ పరిశ్రమ.

*** పరిశ్రమకు.. రోజుకో వ్యర్థ రసాయనాల ట్యాంకర్**

బొటానిక్ హెల్త్ కేర్ పరిశ్రమ మూలికలతో ఔషధాలను తయారు చేస్తుంది. ఈ క్రమంలో అతి తక్కువ మోతాదులో వ్యర్థ రసాయనాల ఉత్పత్తి జరుగుతుంది. పరిశ్రమ మాత్రం రోజుకో వ్యర్థ రసాయనాల ట్యాంకర్ ను నింపి పంపిస్తుంది. శని, ఆదివారాల్లో రెండు విడద రసాయనాల ట్యాంకర్లు పరిశ్రమ నుంచి విడుద రసాయనాలను తీసుకెళ్తున్నాయి. ఔషధాల తయారీ ఎంత జరుగుతుందో తెలియదు కానీ,






వ్యర్థ రసాయనాలు మాత్రం విచ్చలవిడిగా ఉత్పత్తి అవుతున్నాయి.

*** వ్యర్థాల ఉత్పత్తి ఆపండి.. రెడ్జన్ లో కైనా మార్చండి**

బొటానిక్ హెల్త్ కేర్ పరిశ్రమ నుంచి వ్యర్థ రసాయనాల ఉత్పత్తిని తగ్గించాలని పరిసర గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు. ఫార్మా పరిశ్రమను తలపించేలా వేల లీటర్ల వ్యర్థ రసాయనాలను ఒకేరోజులో విడుదల చేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేవిధంగా వ్యర్థ రసాయనాల ఉత్పత్తి జరిగితే, ఆరెంజ్ జోన్ నుంచి రెడ్ జోన్ లోకి పరిశ్రమలు మార్చాలని అధికారులను కోరుతున్నారు.

---

## వర్షాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

* కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : వర్షాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని కొన్ని కాలనీ లలో వరద నీరు వచ్చి ఇబ్బందిగా ఉందని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా కార్పొరేటర్ ఆల్విన్ కాలనీ ఫేస్ 2, ధరణి నగర్, ఎన్టీఆర్ నగర్, ఎల్లమ్మబండ తదితర కాలనీ లలో పర్యటించి జి.ఎచ్.ఎం.సి సిబ్బందితో వరద నీరును తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ వాసులకు వాహనదారులకు ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్ నిలిచిపోకుండా వరదనీటిని క్లియర్ చేయడం జరుగుతుందని అన్నారు. అకాల వర్షాలతోఎటువంటి ఇబ్బందులు కలిగిన,(ఎలక్ట్రికల్, రోడ్డు, డ్రైనేజీ, మంచి నీటి) వంటి సమస్య లు ఎదురైన, వెంటనే సంబంధిత అధికారులకు గాని, మాకు గాని, మా కార్యాలయంకు గాని సంప్రదించాలని తెలియచేసారు. అదేవిధంగా, జీహెచ్ఎంసీ అధికారులు , మాన్ సున్ ఎమర్జెన్సీ టీమ్స్ , డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎటువంటి ఇబ్బంది లేకుండ చూడలని తెలియచేసారు. కార్పొరేటర్ కాలనీ లలో పర్యటిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి , సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్నారో లేదో అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంతో గృహిణులు వండిన అన్నం నాణ్యతను కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, పోశెట్టిగౌడ్, ఖాజా, ఖలీమ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

---



## బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ కార్యకర్తలకు అండగానే ఉంటుంది

* **బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ కార్యకర్తలకు అండగానే ఉంటుందని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. గురువారం నంది నగర్ లోని కేటీఆర్ నివాసం వద్ద శేర్లింగంపల్లి నియోజకవర్గం బి ఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్,కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గారు సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఉద్యమ కారులు నాగరాజు,పీవి రమేష్ లు మృతి చెందిన సందర్భంగా ముందుగా 2నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాటి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేలకోట్ల రూపాయల నిధులతో శేర్లింగంపల్లి నియోజకవర్గం ను అభివృద్ధి చేశామని, ఇదే విషయాన్ని నేటికీ ప్రజలు గుర్తుపెట్టుకున్నారని ప్రజల్లో ఉంటూ చేసిన అభివృద్ధిని వివరిస్తూ వారికి ఏదైనా సమస్య ఉన్నా కూడా పరిష్కరించే దిశగా నాయకులు కార్యకర్తలు ముందుకు వెళ్లాలన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి తప్ప నేడు ఒక్క మంచి పని కూడా జరగలేదని కాంగ్రెస్ పార్టీ వచ్చిన తర్వాత రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ మంచినీటితో ప్రజలు మౌలిక సదుపాయాలు అందక ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. తిరిగి మళ్లీ బి ఆర్ ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని మళ్లీ పూర్వ వైభవం తీసుకొద్దామని తొందర్లోనే నియోజకవర్గం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయమని మేము కూడా వస్తామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమములో కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి రంగారావు,వీణవరం సింధు ఆదర్శరెడ్డి,మాజీ కార్పొరేటర్లు సాయిబాబా,రంగారావు,బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు రవి యాదవ్,హరీష్ రావు,బద్రయ్య ,మల్లా రెడ్డి సతీష్ రావు శ్రీనివాస్ గౌడ్ బాబూమియా శ్రీకాంత్ ముదిరాజ్ పురుషోత్తం యాదవ్ రోజా రామకృష్ణ కిరణ్ యాదవ్ శ్రీనివాస్ శ్రీకాంత్ వెంకటేష్ యాదవ్ సుబ్బరాజు సంజీవ రెడ్డి అల్లావుద్దీన్ పటేల్ రాములు తదితరులు పాలుగొన్నారు

---



## ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

ప్రజాస్ఫూర్తి,కుత్బుల్లాపూర్: గాజులరామారం చౌరస్తాలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు .ఈ సందర్బంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాబిన్ హుడ్ గా ప్రజా వీరుడుగా ఆయనను కీర్తించారు. పండుగ సాయన్న పేద ప్రజల కోసం నిలబడి ఆధిపత్య వర్గాలపై యుద్ధం చేశాడన్నారు. భారత స్వాతంత్ర ఉద్యమ కాలంలో నిజాం రాజ్యంలో జరిగిన తిరుగుబాటు ఉద్యమాలలో ఆయన పోరాటం ఒక చరిత్ర అని గుర్తు చేసారు. ఆనాడు బహుజనుల ఐక్యత అభివృద్ధికై పండుగ సాయన్న ఆధ్వర్యంలో సహపంక్తి భోజన కార్యక్రమాలు వంటివి ఏర్పాటు చేసి పేద ప్రజల ఆకలిని తీర్చాడన్నారు. ఆయన 38 ఏళ్ళ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాలలో చేర్చి రాబోవు తరాలకు ఆయన చరిత్రను తెలియజేయాలన్నారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, ఆయన విగ్రహాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు దొంతుల రమేష్ ముదిరాజ్ , ముదిరాజ్ జర్నలిస్ట్ సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సుగ్రీవుడు ముదిరాజ్ , కార్యదర్శి బక్కని పాండురంగం ముదిరాజ్, ఎన్ఎంఆర్ యువసేన కుత్బుల్లాపూర్ అధ్యక్షులు పుట్టి శివ ముదిరాజ్ , ముదిరాజ్ యువ నాయకులు విష్ణువర్ధన్ ముదిరాజ్ , కిష్టయ్య ముదిరాజ్, భూపేష్ ముదిరాజ్, గోపాల్ ముదిరాజ్, సంజయ్ ముదిరాజ్, కార్తీక్ ముదిరాజ్, దత్తు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

---

## సంస్కృతి పాఠశాలలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

జగద్గిరి గుట్ట, (ప్రజాస్ఫూర్తి) : .గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి రాజీవ్ గృహకల్పలో గల సంస్కృతి పాఠశాలలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు విద్యార్థులకు రాఖీ కట్టి నీకు నేను రక్ష నాకు నీవు రక్ష అంటు రాఖీ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పాఠశాలలో వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు అనంతరం పాఠశాల కరస్పాండెంట్ గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ పండుగల విశిష్ణతను విద్యార్థులకు తెలియజేసేందుకు .ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు






---



## శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం చిన్న కొండూరు రోడ్డులోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో మహిళా భక్తులచే సామూహిక సామూహిక వరలక్ష్మి వ్రతం, కుంకుమార్చన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో 400మంది మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం సుధాకర్ శర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పెద్ద ఎత్తున మహిళా భక్తులు దేవాలయానికి వచ్చి తమ సౌభాగ్యాన్ని కాపాడాలని భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన ప్రతి మహిళ కుటుంబానికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ ధర్మకర్తలు కామిశెట్టి చంద్రశేఖర్ గుప్త, గుర్రం వెంకటేశం, వర్కాల వెన్నెల రవి గౌడ్, తూర్పాటి నరసింహ, మహిళా భక్తులు చింతల విజయలక్ష్మి, చింతల కర్ణ, ఉప్పల కుసుమ వరలక్ష్మి వ్రత కార్యక్రమం సహకరించిన పూజా సామాగ్రి దాతలు గుర్రం విమల, వెంకటేశం, మహిళా భక్తులకు వాటర్ బాటిల్స్ దాతలు ట్రినిటీ విద్యాలయాల చైర్మన్ కే వి బి కృష్ణారావు, డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల, మహిళా భక్తులు లత, దేవరపల్లి కర్ణ నిర్మల, ఉప్పల దీపిక, కాసాని ఐలమ్మ, బద్దం స్వప్న సాధన, సింగిరెడ్డి రజిత, విశ్వనాధుల ఝాన్సీ, బొబ్బిళ్ళ యశోధ, వరగంటి మమత, బడుగు గౌరీశ్వరి, వీరమల్ల అశ్విని, చెరుకు జయలలిత, దాచేపల్లి లక్ష్మి, జెల్ల సుజాత, మన్నే శివరాణి, పెద్ది స్వాతి, సోమవారం లక్ష్మి, వనపర్తి పావని, బత్తుల లావణ్య, బాలగోని ప్రగతి, రాజపేట శ్రీలత, గంజి అనసూయ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# సింగూరు ప్రాజెక్టుకు ఎలాంటి ఇబ్బంది లేదు: ఈఎన్‌సీ జనరల్

సింగూరు: సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టుపై డ్యామ్ సేఫ్టీ అధికారులు నివేదిక ఇచ్చిన నేపథ్యంలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లారు. సింగూరు ప్రాజెక్టు గేట్లు, డ్యామ్ కట్ట నాణ్యతను పరిశీలించారు. నీటి పారుదలశాఖ చీఫ్ ఇంజినీర్ అంజద్ హుస్సేన్, ఈఎన్‌సీ ఆపరేటింగ్, మెయింటెనెన్స్ శ్రీనివాస్, చీఫ్ ఇంజినీర్ సెంట్రల్ డిజైన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తదితరులు ప్రాజెక్టు నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఈఎన్‌సీ జనరల్ మాట్లాడుతూ ప్రాజెక్టుకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. టెంపరరీ మరమ్మతులకు



నిధులు కేటాయించామని, సింగూర్ ప్రాజెక్టు డేంజర్ జోన్‌లో లేదని తెలిపారు. వేసవిలో పూర్తి స్థాయి మరమ్మతులు చేస్తామన్నారు. నీరు బేస్ లెవెల్‌కు తగ్గే వరకు ఏమీ చేయలేమన్న ఆయన.. ప్రాజెక్టులో స్టోరేజీ ఎక్కువగా లేకుండా చూస్తామన్నారు.

## విద్యార్థులకు గుడ్‌న్యూస్.. TSRTC ఐటీఐ కాలేజీలో ప్రవేశాలకు ఆహ్వానం

హైదరాబాద్: ఐటీఐ కోర్సుల్లో చేరాలనుకొనే విద్యార్థులకు టీఎస్ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. హైదరాబాద్ శివారులోని హకీంపేట్‌లో TSRTC ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎనిమిది, పదో తరగతి విద్యార్హతతో మోటార్ వెహికల్ మెకానిక్, మెకానిక్ డీజిల్, వెల్డర్, పెయింటర్ ట్రేడ్‌లలో కోర్సులు అందిస్తున్నట్లు పేర్కొంది. అర్హులైన, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆగస్టు 28లోగా తమ వెబ్‌సైట్‌లో http://iti.telangana.gov.in దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. వాక్ ఇన్ ఫేజ్‌లో ఆన్‌లైన్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఐటీఐ కోర్సుల్లో చేరాలనుకొనే విద్యార్థులు మరింత సమాచారం కోసం 9100664452, 6302649844, 04069400000 ఫోన్ నంబర్లను సంప్రదించాలని టీఎస్ఆర్టీసీ సూచించింది. మెకానిక్ డీజిల్, వెల్డర్ కోర్సులు ఒక ఏడాది కోర్సులు కాగా.. మెకానిక్ (మోటర్ వెహికల్), పెయింట్ కోర్సులు రెండేళ్ల వ్యవధితో అందిస్తున్నారు. వెల్డర్, పెయింటర్ కోర్సులకు ఎనిమిదో తరగతి విద్యార్హతగా నిర్ణయించారు. ఈ కోర్సులకు ఏడాదికి రూ.16,500 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

## బండి సంజయ్.. ఆరోపణలు నిరూపించు: కేటీఆర్ సవాల్

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. ఇంటెలిజెన్స్ విభాగంపై ఆయనకు కనీస పరిజ్ఞానం లేదని, కేంద్ర హోం శాఖ సహాయమంత్రిగా పని చేస్తున్నప్పటికీ.. ఆయనకు ఆ మాత్రం పరిజ్ఞానం లేకపోవడం విచారకరమని అన్నారు. ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ.. ''ఇంటెలిజెన్స్ విభాగం ఎలా పని చేస్తుందో సంజయ్ అర్థం చేసుకోలేరు.



నిర్లక్ష్యంతో ఆయన చేసిన ప్రకటనలు హద్దు మీరాయి. చౌకబారు ఆరోపణలతో ఆయన మరింత దిగజారారు. రాజకీయ ఉనికి కోసం రోడ్లపై చౌకబారు నాటకాన్ని ఎంచుకున్నారు.'' అని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల్లో నిజం ఉంటే నిరూపించాలని సంజయ్‌కు సవాల్ విసిరారు. లేదంటే 48 గంటల్లో వ్యాఖ్యలు ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే లీగల్ నోటీసులు పంపుతానని హెచ్చరించారు.

## మెడిసిటీ మెడికల్ కాలేజీలో గంజాయి కేసు.. విద్యార్థులే పెడ్లర్లు!

మేడ్చల్: మేడ్చల్ మెడిసిటీ మెడికల్ కళాశాలలో గంజాయి కేసులో కొత్త కోణం బయటపడింది. మూడేళ్లుగా కాలేజీలో చదువుతున్న వైద్య విద్యార్థులు కూడా గంజాయిని విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని హైదరాబాద్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. డ్రగ్స్‌పై ఈగల్ పోలీసులు నిర్వహిస్తున్న ఆపరేషన్‌లో మెడిసిటీ వైద్య విద్యార్థులు గంజాయి తీసుకున్నట్లు గురువారం పోలీసులు గుర్తించారు. డ్రగ్స్ టెస్టులో గంజాయి పాజిటివ్ వచ్చిన పలువురు విద్యార్థుల్ని డీ అడిక్షన్ సెంటర్‌కు పంపించారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన ఏఎన్‌బీ అధికారులకు మరిన్ని విషయాలు తెలిశాయి. సీనియర్ విద్యార్థులే



జూనియర్లకు గంజాయి అలవాటు చేశారని, వారే వాటిని విక్రయించినట్లు గుర్తించారు. వైద్య విద్యార్థులకు గంజాయి విక్రయించిన డ్రగ్ పెడ్లర్ బొల్లారానికి చెందిన హరాఫత్ అలీఖాన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడు అలీఖాన్ బీదర్‌కు చెందిన జరీనా బాను నుంచి గంజాయిని కొనుగోలు చేసి.. వైద్య విద్యార్థులకు అమ్ముతున్నట్లు పోలీసులు చెప్పారు.



## రాఖీ పండగ ఎఫెక్ట్.. హైదరాబాద్‌లో కిక్కిరిసిన ఆర్టీసీ బస్టాండ్లు

హైదరాబాద్: మహానగరంలో రాఖీ పండగ సందడి మొదలైంది. తమ సోదరులకు రాఖీ కట్టేందుకు పెద్ద ఎత్తున అక్కాచెల్లెళ్లు బయల్దేరారు. ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్లు కిక్కిరిసిపోయాయి. 'రాఖీ స్పెషల్' పేరుతో తెలం గాణ ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు అందిస్తోంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. డీలక్స్, సూపర్ లగ్జరీ వంటి బస్సుల్లో ముందే రిజర్వేషన్లు పూర్తయ్యాయి. దీంతో నేరుగా బస్టాండ్లకు చేరుకున్న ప్రయాణికులు తీవ్ర నిరాశ పడుతున్నారు. అదనంగా మరికొన్ని బస్సులు అందించాలని కోరుతున్నారు.

## మూడు దశాబ్దాల తర్వాత నీటిపారుదల శాఖలో పదోన్నతులు, బదిలీలు: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు త్వరగా ప్రారంభించాలని అధికారులను రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. అవసరమైన అనుమతులపై త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ నిర్వహిస్తారని చెప్పారు. శుక్రవారం నీటిపారుదశాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మూడు దశాబ్దాల తర్వాత నీటిపారుదల శాఖలో పదోన్నతులు, బదిలీలు జరుగుతున్నట్లు చెప్పారు. ''ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదం తర్వాత నిపుణుల కమిటీ సిఫార్సులతో తిరిగి పనులు మొదలుపెట్టాలి. ముఖ్యమైన ప్రాజెక్టు 9 కి.మీ పనికే నిలిచిపోవడం దురదృష్టకరం. ఎస్ఎల్‌బీసీ పూర్తి కానందున



ఎత్తిపోతలకు ఏటా రూ.750 కోట్లు ఖర్చవుతోంది. అత్యాధునిక సాంకేతికతతో ముందుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్జీఆర్ఐ సర్వేతో భూగర్భం కి.మీ దిగువ వరకు మ్యాపింగ్ చేయొచ్చు. కచ్చితమైన ప్రణాళిక కోసం లైడార్ సర్వే కూడా చేస్తాం. నాణ్యతలో రాజీపడకుండా మంత్రివర్గం ఆమోదించిన అంచనాతో ప్రాజెక్టు పనులు చేపట్టాలి''అని మంత్రి తెలిపారు. మరోవైపు ఎస్ఎల్‌బీసీ సొరంగానికి హెలికాప్టర్‌తో మాగ్నెటిక్ జియోఫిజికల్ సర్వేకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రూ.2.36 కోట్లతో నామినేషన్ పద్ధతిన ఎన్జీఆర్ఐకి పనులు అప్పగించింది. అలాగే, నీటిపారుదల శాఖలో 46 మంది ఈఈలకు ఎస్ఈలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 123 మంది ఏఈఈలకు డీఈఈలుగా పదోన్నతి కల్పించింది.



## క్యుములోనింబస్ ప్రభావం.. తెలంగాణలో భారీ వర్షాలు!

హైదరాబాద్: క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో ఈ ప్రభావం కొనసాగే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణ జిల్లాలైన రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్, యాదాద్రి భువనగిరి, జనగామ, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. మరోవైపు శనివారం వనపర్తి, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈ మూడు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. ఇదే పరిస్థితులు 11వ తేదీ వరకు కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు పశ్చిమ, మధ్య బంగాళాఖాతంలో ఈ నెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం తెలిపింది.

## 78 ఫిర్యాదులను పరిష్కరించిన హైడ్రా

మల్కం చెరువు పరిసరాల్లో వరద పోటెత్తడానికి గల కారణాలను హైడ్రా కమిషనర్ ఏవీ. రంగనాథ్ శుక్రవారం ఉదయం సమీక్షించారు. వరద ముంచెత్తడానికి, ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడడానికి కారణాలను క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకున్నారు. చెరువుకు వచ్చే వరద పెద్దమొత్తంలో ఉండి.. బయటకు వెళ్లేది ఆ స్థాయిలో లేకపోవడంతో సమస్య తలెత్తిందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం అలుగు పారడం ద్వారా మాత్రమే నీరు బయటకు వెళ్తోందని.. స్లూయిజ్ గేట్లు కూడా ఏర్పాటు చేస్తే.. వర్షాకాలంలో నీటిమట్టాన్ని తగ్గించడానికి వీలౌతోందని చెప్పారు. వర్షాలు తగ్గుముఖం పట్టినప్పుడు వెంటనే ఈ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు. చెరువు పరిసరాల్లో రహదారులే కాకుండా.. నివాసాలు కూడా నీట మునుగుతున్నాయని.. వెంటనే ఈ పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. చెరువులోకి వచ్చిన ఇన్లెట్ల సామర్థ్యంతో పాటు.. ఔట్లెట్ను కూడా హైడ్రా కమిషనర్ పరిశీలించారు. మల్కం చెరువు చుట్టూ వరద నిలవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. బయోడైవర్సిటీ పార్కు పరిసరాలతో పాటు.. షేక్పేట ప్రాంతాల నుంచి కూడా భారీ వరద వచ్చి వంతెన ఆరంభంలో నిలిచిపోతోందని.. ఈ వరదంతా మల్కం చెరువులోకి చేరేలా ఏర్పాట్లు చేయాలన్నారు. హైడ్రా అదనపు సంచాలకులు శ్రీ వర్ల పాపయ్యగారు. సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, ట్రాఫిక్ జాయింట్ సీపీ గజరావు భూపాల్ తదితరులు కమిషనర్తో పాటు క్షేత్ర స్థాయి పరిశీలనలో ఉన్నారు.

**గురువారం అర్ధరాత్రి వరకూ ...**

గురువారం సాయంత్రం 15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గచ్చిబౌలి పరిసరాలు గురువారం రాత్రి నీట మునిగాయి. గచ్చిబౌలి నుంచి మెహిదీపట్నం వెళ్లే రహదారి షేక్ పేట వంతెన ఆరంభంలో నడుము లోతు నీళ్లు నిలిచిపోయాయి. అలాగే ఉస్మానియా కాలనీలోని కొన్ని ప్రాంతాల్లోకి కూడా భారీగా వరద నీరు వచ్చి చేరింది. హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ హుటాహుటిన అక్కడకు చేరుకుని వరద నీటిని తొలగించే పనులను పర్యవేక్షించారు. తొలుత ఉస్మానియా కాలనీలో వరద ప్రాంతాల్లో సహాయక చర్యలను పర్యవేక్షించిన హైడ్రా కమిషనర్.. మల్కం చెరువు పరిసరాలను



పరిశీలించారు. వరద తొలగించే పనులను పర్యవేక్షిస్తూనే.. ట్రాఫిక్ క్లియరెన్స్పై దృష్టి పెట్టారు. వరద ముప్పు లేని ప్రాంతాల నుంచి కూడా హైడ్రా డీఆర్ ఎఫ్, ఎంఈటీ బృందాలు అక్కడికి చేరుకుని వాహన రాకపోకలు సులభం అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బందితో పాటు.. అర్ధరాత్రి 12.30 గంటల వరకూ అక్కడే ఉండి.. వరదతోపాటు.. ట్రాఫిక్ క్లియర్ అయ్యేలా చూశారు. యిలా మొత్తం 78 ఫిర్యాదులను రాత్రికి రాత్రే హైడ్రా పరిష్కరించింది. 41 చోట్ల పడిపోయిన చెట్లను పక్కకు తొలించారు. 36 చోట్ల వరద నీరు నిలిచిపోగా హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ , మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు సమస్యను పరిష్కరించాయి. బంజారాహిల్స్ లోని ఎస్బీఐ ఎగ్జిక్యూటివ్ ఎంక్లేవ్, గ్రీన్ వ్యాలీ సమీపంలో వరదలో చిక్కుకున్న మహిళను కాపాడారు.

## నేను పదవుల కోసం పాకులాడలేదు గువ్వల బాలరాజుపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శలు

బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై ఆ పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శలు గుప్పించారు. పదవులు ఇవ్వలేదని అలిగేవాడు కార్యకర్త కాదని బాలరాజుకు చురకలంటించారు. తాను ఎప్పుడూ పదవుల కోసం పాకులాడలేదని చెప్పారు. తనకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పదవి ఇస్తానని రేవంత్ రెడ్డి ఓ వేదికపై చెప్పారని... కానీ తాను పదవులకు ఆశ పడలేదని... కేసీఆర్ కు మాట ఇచ్చానని... అధికారం ఉన్నా లేకున్నా కేసీఆర్ వెంటే నడుస్తానని అన్నారు. అచ్చంపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతూ ప్రవీణ్ కుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు.తాను బీఆర్ఎస్ నుంచి ఎంపీ టికెట్ కూడా అడగలేదని... ఆ విషయం గువ్వల బాలరాజుకు కూడా తెలుసని చెప్పారు. తనకు కాదని నాగర్ కర్నూల్ ఎంపీ టికెట్ ప్రవీణ్ కుమార్ కు ఇచ్చారని బాలరాజు పలు ఇంటర్వ్యూల్లో చెప్పారని... ఎంపీ కావాలని తాను బీఆర్ఎస్ లోకి రాలేదని చెప్పారు. ఏడు సంవత్సరాల ఐపీఎస్ సర్వీస్ ఉండగానే తాను ఉద్యోగాన్ని వదిలేశానని తెలిపారు. కొన్ని రాష్ట్రాల్లో తన మిత్రులు డీజీపీలుగా ఉన్నారని... సర్వీసులో ఉంటే తనకు కూడా డీజీపీ హోదా వచ్చేదని చెప్పారు. డీజీపీ అయితే తనకే లాభమని... కానీ, బలహీన వర్గాల ప్రజల కోసం తాను రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు.



# లండన్‌లో ఐపీఎల్ కోచ్‌తో.. 'వన్డేలకు సై' అంటున్న కోహ్లీ

### లండన్‌లో కొత్త లుక్‌తో కనిపించిన విరాట్ కోహ్లీ

### కోహ్లీని చూసి గుర్తుపట్టలేకపోతున్నామంటున్న అభిమానులు

### వన్డేల నుంచి కూడా రిటైర్మెంట్ తీసుకోబోతున్నారంటూ ఊహాగానాలు

### కోహ్లీ భవిష్యత్తుపై అభిమానుల్లో తీవ్ర ఆందోళన



**లండన్:** టీమిండియా మాజీ కెప్టెన్, స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీకి సంబంధించిన ఒక ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. లండన్‌లో తీసిన ఈ ఫొటోలో కోహ్లీ పూర్తిగా నెరిసిన గడ్డంతో గుర్తుపట్టలేనంతగా మారిపోయి కనిపించాడు. దాంతో ఆయన వన్డే క్రికెట్‌కు కూడా రిటైర్మెంట్ ప్రకటించబోతున్నారనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఇది ఆయన అభిమానుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది.

వివరాల్లోకి వెళితే.. ఇటీవల లండన్‌లో ఒక అభిమానితో విరాట్ కోహ్లీ దిగిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఫొటోలో ఆయన గడ్డం చాలా వరకు తెల్లగా నెరిసిపోయి ఉంది. ఈ లుక్‌లో కోహ్లీని చూసిన చాలామంది అభిమానులు షాక్ అయ్యారు. కొందరైతే ఆయన్ను మొదట గుర్తుపట్టలేకపోయామని కామెంట్లు పెడుతున్నారు. ఇప్పటికే టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన కోహ్లీ, ఇప్పుడు వన్డేల నుంచి కూడా తప్పుకోబోతున్నారనే దానికి ఇదే సంకేతమంటూ సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి.

"వన్డే రిటైర్మెంట్ లోడింగ్?" అంటూ ఎంతోమంది మీమ్స్, పోస్టులు షేర్ చేస్తూ తమ ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. గతంలో కోహ్లీ ఓ కార్యక్రమంలో తన గడ్డం గురించి సరదాగా మాట్లాడుతూ, "రెండు రోజుల క్రితమే గడ్డానికి రంగు వేసుకున్నా. ప్రతి నాలుగు రోజులకు ఒకసారి గడ్డానికి రంగు వేయాల్సి వస్తోందంటే సమయం దగ్గరపడిందని అర్థం చేసుకోవాలి" అని వ్యాఖ్యానించారు. అప్పుడు సరదాగా అన్న మాటలను ఇప్పుడు అభిమానులు సీరియస్‌గా తీసుకుంటున్నారు.

కోహ్లీ శారీరకంగా పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నప్పటికీ, ఆయన తాజా రూపం మాత్రం రిటైర్మెంట్‌పై చర్చను మరింత పెంచింది. అయితే, తన వన్డే కెరీర్ భవిష్యత్తుపై విరాట్ కోహ్లీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఆయన తదుపరి నిర్ణయం కోసం క్రికెట్ ప్రపంచం, అభిమానులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

# నష్టాల్లో స్టాక్ మార్కెట్లు..

### 80 వేల మార్క్ దిగువకు సెన్సెక్స్



**ముంబై:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన టారిఫ్‌ల భయాల నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం కుప్పకూలాయి. అన్ని రంగాల్లోనూ అమ్మకాలు ఒత్తిడి పెరగడంతో సూచీలు భారీగా పతనమయ్యాయి. ఫలితంగా సెన్సెక్స్ 80 వేల మార్క్ దిగువకు పడిపోయింది. మూడు నెలల కనిష్ఠ స్థాయికి చేరింది. దాంతో మదుపరులు తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. భారత్ నుంచి వచ్చే దిగుమతులపై సుంకాలను 50 శాతానికి పెంచామని, రష్యా నుంచి చమురు దిగుమతిని కొనసాగిస్తే ఈ టారిఫ్‌లను మరింత పెంచుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ ప్రకటన దేశీయ మార్కెట్లలో తీవ్ర ఆందోళనకు దారితీసింది. దీనికితోడు విదేశీ సంస్థాగత మదుపరులు నిరంతరాయంగా తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడంతో పతనం మరింత తీవ్రమైంది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 765.47 పాయింట్లు నష్టపోయి 79,857.79 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సమయంలో ఒక దశలో 79,775 పాయింట్ల కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. అదేవిధంగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 232 పాయింట్లు కోల్పోయి 24,363.30 వద్ద ముగిసింది.

రియల్టీ, మెటల్, ఆటో, ఐటీ, బ్యాంకింగ్ షేర్లు తీవ్రంగా నష్టపోయాయి. సెన్సెక్స్ బాస్కెట్‌లో భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్, ఇన్ఫోసిస్ వంటి ప్రధాన షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఎన్‌టీపీసీ, టైటాన్ లాంటి కొన్ని షేర్లు మాత్రమే లాభపడ్డాయి. కాగా వరుసగా ఆరో వారంలోనూ మార్కెట్లు నష్టాలతోనే ముగియడం గమనార్హం.

## పెరుగుతున్న బంగారం ధర..



**న్యూఢిల్లీ:** బంగారం కొనుగోలు చేయాలని ఎవరు అనుకోరు, మహిళలు ఎక్కువగా ఇష్టపడేది బంగారమే. అందుకే వీరు ఎక్కువగా గోల్డ్ కొనుగోలు చేయాలి అనుకుంటారు. ఇక ఏ చిన్న శుభకార్యం అయినా బంగారం తప్పనిసరి. ప్రస్తుతం శ్రావణ మాసం కావడంతో ఈ మాసంలో పెళ్లిలు, శుభకార్యాలు చాలా ఉంటాయి. దీంతో చాలా మంది గోల్డ్ కొనుగోలు చేయాలి అనుకుంటారు. కానీ గోల్డ్ కొనుగోలు చేసే వారికి ఇది షాకింగ్ న్యూస్ అనే చెప్పాలి. ఎందుకంటే నేడు గోల్డ్ ధర స్వల్పంగా పెరిగింది.బంగారం కొనుగోలు చేయాలని ఎవరు అనుకోరు, మహిళలు ఎక్కువగా ఇష్టపడేది బంగారమే. అందుకే వీరు ఎక్కువగా గోల్డ్ కొనుగోలు చేయాలి అనుకుంటారు. ఇక ఏ చిన్న శుభకార్యం అయినా బంగారం తప్పనిసరి. ప్రస్తుతం శ్రావణ మాసం కావడంతో ఈ మాసంలో పెళ్లిలు, శుభకార్యాలు చాలా ఉంటాయి. దీంతో చాలా మంది గోల్డ్ కొనుగోలు చేయాలి అనుకుంటారు. కానీ గోల్డ్ కొనుగోలు చేసే వారికి ఇది షాకింగ్ న్యూస్ అనే చెప్పాలి. ఎందుకంటే నేడు గోల్డ్ ధర స్వల్పంగా పెరిగింది.

బంగారం ధరలు అనేవి రోజు రోజుకు పెరుగుతూ సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. మన దేశంలో బంగారానికి ఉన్న డిమాండ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. చాలా మంది ఎక్కువగా కొనడానికి ఇష్టపడే దాంట్లో బంగారమే ముందుంటుంది. కానీ ప్రస్తుతం గోల్డ్ రేట్స్ అనేవి ఆకాశాన్నంటుతున్నాయి. రోజు రోజుకు ధరలు పెరుగుతూ సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇప్పటికే గోల్డ్ రేట్స్ లక్షమార్క్ దాటిన విషయం తెలిసిందే.

బంగారం ధరలు అనేవి రోజు రోజుకు పెరుగుతూ సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. మన దేశంలో బంగారానికి ఉన్న డిమాండ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. చాలా మంది ఎక్కువగా కొనడానికి ఇష్టపడే దాంట్లో బంగారమే ముందుంటుంది. కానీ ప్రస్తుతం గోల్డ్ రేట్స్ అనేవి ఆకాశాన్నంటుతున్నాయి. రోజు రోజుకు ధరలు పెరుగుతూ సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇప్పటికే గోల్డ్ రేట్స్ లక్షమార్క్ దాటిన విషయం తెలిసిందే. ఆగస్టు 8, 2025న 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,02,560 గా ఉండగా,22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.94,010గా ఉంది. ఆగస్టు 07, 2025 శుక్రవారం (నిన్న)24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,02,550గా ఉండగా,నేడు రూ.10 పెరగడంతో గోల్డ్ రేట్ రూ.102,560గా ఉంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర నిన్న రూ.94,000గా ఉండగా, నేడు రూ.10 పెరగడంతో గోల్డ్ రేట్ రూ.94,010గా ఉంది. ప్రముఖ నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే.. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,02,560ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.94,010 లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,27,000లుగా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,02,560 ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.94,010లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,20,000 లుగా ఉంది.వరంగల్ జిల్లాలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,02,560, 22 క్యారెట్ల ధర 94,010లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,27,000లుగా ఉంది.

## టాటా ఏస్ ప్రో కొత్త వ్యాపారాలకు అనువైనది

### మాజీ ప్రొఫెసర్ అరుణ్ కుమార్






**న్యూఢిల్లీ:** దేశంలోని వివిధ రాష్ట్రాల్లో టాటా ఏస్ ప్రో ప్రారంభం అవుతోంది. టాటా మోటార్స్ తన మొదటి ఏస్ 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తర్వాత టాటా -ఏస్ ప్రోతో కొత్త ఆరంభం చేసింది. దేశంలో ఇదే మొదటి ప్రో ట్రక్. దీని ప్రారంభ ధర రూ.3.99 లక్షలు మాత్రమే. ఇది కొత్త, చిన్న వ్యాపారవేత్తల కోసం రూపొందించారు. మూడు ఇంధన వేరియంట్లలో లభిస్తుంది. ఆర్థికవేత్త, మాజీ ప్రొఫెసర్ ప్రొఫెసర్ అరుణ్ కుమార్ టాటా ఏస్ ప్రోపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. అబ్ మేరీ బారి చాలా మంచి ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇది ప్రజలలో ఉత్సాహాన్ని పెంచుతుంది. ప్రజలు ఉపాధిని సృష్టిస్తే ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుంది. ఎక్కువ ఉపాధి సృష్టిస్తే పేదరికం తగ్గుతుందని ఆయన అన్నారు. దీనితో పాటు టాటా ఏస్ ప్రోకు సంబంధించిన అనేక ఇతర ప్రయోజనాలను ఆయన చెప్పారు. టాటా ఏస్ ప్రో కొత్త వ్యాపారాలకు అనువైనదని అరుణ్ కుమార్ అన్నారు.

# సాకర్ మాంత్రికుడి హ్యాట్రిక్ గోల్..

### సంబురాల్లో అభిమానులు..



**సౌదీ అరేబియా:** సాకర్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో ఆట ఓ రేంజ్‌లో ఉంటుందని తెలిసిందే. మైదానంలోకి దిగాడంటే ఈ ఫార్వర్డ్ ప్లేయర్ మెరుపు వేగంతో బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపి అందర్నీ ఆశ్చర్యపరుస్తుంటాడు. ఈసారి కూడా అలాంటి మెరుపు గోల్స్‌తో ఫ్యాన్స్‌ను ఫిదా చేశాడీ ఫుట్‌బాల్ స్టార్. అల్ నస్రీ తరపున హ్యాట్రిక్ గోల్ కొట్టాడు రొనాల్డో. అంతే.. అభిమానులు పూనకం వచ్చిన వాళ్లలా రొనాల్డో.. రొనాల్డో.. అంటూ ఊగిపోయారనుకో. మూడేళ్ల క్రితం సౌదీ అరేబియా క్లబ్ అల్ నస్రీకి మారిన రొనాల్డో సంచలన ఆటతో అదరగొడుతున్నాడు. సౌదీ ప్రో లీగ్‌లో దుమ్మురేపిన ఈ స్టార్ ప్లేయర్ గురువారం రియో అవే జట్టుపై చెలరేగాడు. తన అనుభవాన్నంతా ఉపయోగిస్తూ.. బుల్లెట్‌లా ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పై దాడి చేస్తూ వరుసగా మూడు గోల్స్ చేశాడు. పెనాల్టీ కార్నర్‌ను రెప్పపాటులోనే గోల్ పోస్ట్ లోకి పంపి హ్యాట్రిక్ సాధించాడు. ఈ సాకర్ మాంత్రికుడు వరుసపెట్టి గోల్స్ వర్షం కురిపిస్తుంటే అభిమానులు సంబురాల్లో మునిగిపోయారు. ప్రస్తుతం రొనాల్డో హ్యాట్రిక్ గోల్ వీడియో నెట్టింట వైరలవుతోంది. ఇంకెందుకాలస్యం మీరూ చూసేయండి.

ఖతార్ 2022లో ఆతిథ్యమిచ్చిన ఫిఫా వరల్డ్ కప్ అనంతరం రొనాల్డోను అల్ నస్రీ క్లబ్ రికార్డు ధరకు దక్కించుకుంది. తన పేరుతోనే కాదు ఆటతోనూ అల్ నస్రీ రాతను మార్చేశాడీ ఫార్వర్డ్ ప్లేయర్. దాంతో, మొదట అతడితో రెండున్నరేళ్లకు ఒప్పందం చేసుకున్ను అల్ నస్రీ యాజమాన్యం.. ఈమధ్యే అతడి కాంట్రాక్ట్‌ను మరో రెండేళ్లు అంటే 2027 వరకూ పొడిగించింది. ఇప్పటివరకూ రొనాల్డో ఈ క్లబ్ తరఫున 93 గోల్స్ కొట్టాడు.

# కాన్వే శతక మోత..



### రెండో టెస్టులో కివీస్‌కు భారీ ఆధిక్యం..!

**న్యూజిలాండ్:** తొలి టెస్టులో ఘోరంగా ఓడిన జింబాబ్వే రెండో టెస్టులోనూ ఓటమిని చవిచూసేలా ఉంది. బ్యాటర్ల వైఫల్యంతో కుప్పకూలిన ఆతిథ్య జట్టుకు షాకిస్తూ న్యూజిలాండ్ మ్యాచ్‌పై పట్టుబిగిస్తోంది. ఓపెనర్ డెవాన్ కాన్వే(153) సూపర్ సెంచరీతో చెలరేగగా.. మిడిలార్డర్ బ్యాటర్లు హెన్రీ నికోలస్(95 నాటౌట్), రచిన్ రవీంద్ర (51 నాటౌట్) అర్ధ శతకాలతో విజృంభించారు. కాన్వే ఒక్కడే ప్రత్యర్థి స్కోర్ కొట్టగా.. ఈ ఇద్దరి విధ్వంసంతో రెండో రోజు రెండో సెషన్‌లోనే కివీస్.. మూడొందల ఆధిక్యానికి చేరుకుంది. టీ బ్రేక్ సమయానికి న్యూజిలాండ్ 3 వికెట్ల నష్టానికి 423 రన్స్ కొట్టింది. క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో న్యూజిలాండ్ బ్యాటర్లు పరుగుల వరద కొనసాగిస్తున్నారు. జింబాబ్వే బౌలర్లను ఉతికారేస్తూ ఓపెనర్లు డెవాన్ కాన్వే(153 ), విల్ యంగ్(74) భారీ భాగస్వామ్యంతో పెద్ద స్కోర్‌కు బాటలు వేశారు. తొలి వికెట్‌కు 162 పరుగులు జోడించిన వీళ్లను ఎట్టకేలకు ట్రెవొర్ వాండు విడదీశాడు. యంగ్ బౌల్డయ్యాక వచ్చిన జాకబ్ డఫే(36) త్వరగా ఔటైనా.. కాన్వే తన జోరు చూపాడు. బౌండరీలతో చెలరేగిన ఈ లెఫ్ట్ హ్యాండర్ సెంచరీతో జింబాబ్వే స్కోర్‌ను దాటేసింది కివీస్. కాన్వే వెనుదిరిగే సమయానికి స్కోర్.. 345-3. ఓపెనర్ దాడి నుంచి బ్రేక్ లభించిందని మురిసిపోయే లోపే హెన్రీ నికోలస్ (95 నాటౌట్), రచిన్ రవీంద్ర(51 నాటౌట్)లు క్రీజులో పాతుకుపోయారు. ప్రత్యర్థి బౌలర్ల సహనాన్ని పరీక్షిస్తూ.. స్కోర్ బోర్డును వేగంగా నడిపించారిద్దరూ. అర్ధ సెంచరీ భాగస్వామ్యంతో జట్టు స్కోర్ 400 దాటించారు. ఈ ఇద్దరినీ ఔట్ చేయలేక నానా తంటాలు పడగా టీ బ్రేక్ సమయానికి కివీస్ 302 పరుగుల ఆధిక్యం సాధించింది.

# సిరాజ్‌కు షాకిచ్చిన సచిన్..




**న్యూఢిల్లీ:** అండరన్స్-టెండూల్కర్ ట్రోఫీలో నిప్పులు చెరిగిన మహ్మద్ సిరాజ్ మాజీ ఆటగాడు సచిన్ టెండూల్కర్ షాకిచ్చాడు. మియా భాయ్‌కు తగిన గుర్తింపు రాలేదని అభిప్రాయపడిన సచిన్.. భారత జట్టు చరిత్రాత్మక విజయంలో కీలక పాత్ర పోషించిన అతడిని కాదని ఆకాశ్ దీప్‌ను ఎంచుకున్నాడు. ఐదు టెస్టుల సిరీస్‌లో 'బాల్ ఆఫ్ ది సిరీస్'గా ఆకాశ్‌కే ఓటేశాడు మాస్టర్ బ్లాస్టర్. జో రూట్‌ను బౌల్డ్ చేసిన బంతినే మాస్టర్ బ్లాస్టర్ బాల్ ఆఫ్ ది సిరీస్ అని చెప్పాడు. అలా అని సిరాజ్‌ను ప్రతిభను తాను తక్కువ చేయడం లేదని సచిన్ తాజాగా ఒక వీడియోలో వెల్లడించాడు.

బర్మింగ్‌హమ్‌లో జరిగిన రెండో టెస్టులో గిల్ సేన సూపర్ విక్టరీతో సిరీస్ సమం చేసింది. ఆ మ్యాచ్‌లో ఆకాశ్ దీప్ క్రీజులో పాతుకుపోయిన జో రూట్‌ను అద్భుతమైన బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆకాశ్ సంధించిన ఆ బంతినే సచిన్ బాల్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపిక చేశాడు. 'నా దృష్టిలో జో రూట్‌ను బౌల్డ్ చేసిన ఆకాశ్ దీప్ బంతి అద్భుతం. అతడి వికెట్ తీయడం మ్యాచ్ ఫలితాన్నే మార్చేసింది. ఆకాశ్ విసిరిన బంతిని కాస్త ఆలస్యంగా ఆడాడు రూట్. భీకర ఫామ్‌తో పాటు టన్నుల కొద్దీ పరుగులు బాదిన రూట్‌ను ఔట్ చేయడం ద్వారా భారత జట్టు విజయావకాశాలు పెరిగాయి. అందుకే.. ఆ బంతిని బాల్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంచుకున్నా' అని సచిన్ వివరించాడు.

ఓవల్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లతో 'మ్యాచ్ విన్నర్'గా నిలిచిన సిరాజ్‌ను ఆకాశానికెత్తేశాడు. 'ఐదు టెస్టుల సిరీస్‌లో సిరాజ్ ప్రదర్శన నమ్మశక్యం అనిపించలేదు. చాలా గొప్పగా బౌలింగ్ చేశాడు. అతడి ఆటిట్యూడ్ నాకెంతో నచ్చింది. అతడి పాదాలలో ఉన్న లయ, వేగం చాలా నచ్చాయి. నిలకడగా లైన్ అండ్ లెంగ్త్‌తో ఆఖరి రోజు సిరాజ్ సూపర్ స్పెల్ వేశాడు. సిరీస్‌లో అప్పటికే 1,000కి పైగా బంతులు వేసిన అతడు.. ఐదో రోజు కూడా గంటకు 145 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేశాడని కామెంటేటర్లు చెప్పగా విన్నాను. అతడి ధైర్యం, జట్టును గెలిపించాలనే అతడి కసి అద్భుతం. జట్టుకు అవసరమైన ప్రతిసారి సిరాజ్ నేనున్నానంటూ ముందుకొస్తాడు. కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ కెప్టెన్ బౌలర్ అనిపించుకుంటాడు. గతంలో చేసినట్టే ఈ సిరీస్‌లోనూ ఈ పేస్ గన్ తన సత్తా చాటాడు. సిరీస్‌లో అతడు తీసిన వికెట్లే అందుకు నిదర్శనం. ఎంతో ప్రతిభ ఉన్నా సరే సిరాజ్‌కు మాత్రం తగినంత గుర్తింపు రాలేదు అని టెండూల్కర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

# విడుదలకు సిద్ధమవుతున్న అఖండ-2




**టాకీస్:** నందమూరి నటసింహం బాలకృష్ణ- మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'అఖండ 2' పై ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. సింహ, లెజెండ్, అఖండ వంటి ఘన విజయాల తర్వాత ఈ జోడీ మరోసారి స్క్రీన్ మీద అదరగొట్టేందుకు సిద్ధమవుతోంది. అఖండ 2 చిత్రం 2021లో వచ్చిన బ్లాక్ బస్టర్ 'అఖండ' కు సీక్వెల్ కావడం విశేషం. ఆ చిత్రంలో బాలయ్య పోషించిన అఘోర పాత్ర, బోయపాటి మాస్ మేకింగ్, తమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు ఆ ఫార్ములాను మరింత పవర్‌ఫుల్‌గా స్క్రీన్ మీదకి తీసుకురావాలని బోయపాటి తెగ కష్టపడుతున్నారు. ఈ భారీ పాన్ ఇండియా మూవీలో ప్రగ్యా జైశ్వాల్, సంజయ్ దత్, ఆది పినిశెట్టి, సంయుక్త మీనన్, జగపతిబాబు, హర్షాలీ మల్హోత్రా వంటి తారాగణం కనిపించనున్నారు.

# కాంతారా నుంచి కనకవతి పరిచయం



టాకీస్: కన్నడ నటుడు రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కాంతార చాప్టర్ -1. 2022లో రిలీజై బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన 'కాంతార' సినిమాకు ప్రీక్వెల్ గా ఈ సినిమా వస్తుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ప్రమోషన్స్ షురూ చేశారు మేకర్స్. ఇందులో భాగంగా ఈ సినిమాలో నటిస్తున్న కథానాయక రుక్మిణి వసంత్‌ని పరిచయం చేశారు మేకర్స్. రుక్మిణి వసంత్ ఇందులో కనకవతిగా కనిపించబోతున్నట్లు ప్రకటించారు. హొంబాలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరంగదూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. అజ్నీశ్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఈ చిత్రాన్ని కన్నడతో పాటు- తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, బెంగాలీ, ఇంగ్లిష్ భాషల్లో విడుదల చేయనున్నారు.

# మళ్లీ లైన్‌లోకి వచ్చిన అనుపమ పరమేశ్వరన్



టాకీస్: టిల్లు స్క్వేర్‌తో హోమ్లీ లుక్కు నుండి మేకోవర్ అయిన అనుపమ పరమేశ్వరన్ ఈ ఏడాది డ్రాగన్‌తో ఓ మంచి శుభారంభాన్ని ఇచ్చింది. అయితే ఇటీవల వచ్చిన జానకి వి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ చెరిపేసింది. టైటిల్ వివాదం వల్ల సరైన ప్రమోషన్లు చేయక ఏదో రిలీజ్ చేశామంటే చేశాం అని తూతూ మంత్రంగా, వ్యవహారం సాగింది. దీని వల్ల కేరళలో చాలా గ్యాప్ తర్వాత వచ్చిన ఫిల్మ్ తన కెరీర్‌కు యూజ్ కాకుండా పోయింది. ఈ రిజల్ట్ ముందే ఊహించారేమో తెలుగులో కూడా రిలీజ్ చేయాలనుకుని చివరి నిమిషంలో వెనక్కు తగ్గారు మేకర్స్. అనుపమ పరమేశ్వర్ కు ఆఫర్ల కొదవ లేదు కానీ చేసిన సినిమాలన్నీ వాయిదాల బాట పడుతున్నాయి. ఇప్పటికే తమిళ్, మలయాళంలో కంప్లీటైన లాక్ డౌన్ లాస్ట్ ఇయర్, పెట్ డి-టె-క్టివ్ ఈ ఏడాది ఫస్ట్ ఆఫ్‌లో థియేటర్లలో హాయ్ చెప్పాల్సి ఉండగా రిలీజ్ డిలే అవుతున్నాయి. టాలీవుడ ఫిల్మ్ పరదా కూడా ప్రవీణ్ కండ్రేగుల శుభం ప్రాజెక్టుపై ఫోకస్ చేయడంతో పోస్ట్ పోన్ అవుతూ ఎట్టకేలకు ఆగస్టు 22న డేట్ లాక్ చేసుకుంది. పరదా బైలింగ్వల్ మూవీగా రాబోతుంది. ఇటు- తెలుగు, అటు మలయాళంలో రిలీజ్ చేయనున్నారు మేకర్స్. నెక్స్ట్ త్రీ మంత్స్‌లో త్రీ ఇండస్ట్రీల్లో అనుపమ సందడి చేయనుంది. పరదాతో పాటు- తమిళ పడమ్ బైసన్ రాబోతుంది. మారి సెల్వరాజ్ స్పోర్ట్ డ్రామాలో విక్రమ్ సన్ ధ్రువ్ విక్రమ్ హీరో. అక్టోబర్ 17పై ఇప్పటికే కర్చీఫ్ వేసుకుంది ఈ సినిమా. ఇదే కాకుండా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో చేస్తున్న కిష్కిందపురి కూడా అదే నెలలో తీసుకు రానున్నారని టాక్. అనేక వాయిదాల అనంతరం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో వస్తోంది అనుపమ.

# బుల్లితెరకు స్మృతి రీ ఎంట్రీ

## ఒక్కో ఎపిసోడ్‌కు 14 లక్షల భారీ పారితోషికం



**టాకీస్:** కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ నటి స్మృతి ఇరానీ ప్రస్తుతం ప్రధాన పాత్రలో నటిస్తున్న హిట్ ధారావాహిక 'క్యోంకీ సాస్ భీ కభీ బహు థీ 2' తో బుల్లితెరపై రీ ఎంట్రీ ఇచ్చారు. ఈ సీరియల్ కోసం ఆమె ఒక్కో ఎపిసోడ్‌కు రూ.14 లక్షల వరకు పారితోషికం తీసుకున్నట్లు వార్తలు ఇటీవల వైరల్ అయ్యాయి. అయితే ఇప్పటికే ఈ విషయంపై సోషల్ మీడియాలో చర్చలు జరగడంతో, స్మృతి ఇరానీ ఈ రెమ్యునరేషన్ గురించి ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. నేనే బుల్లితెరలో అందరికంటే ఎక్కువ పారితోషికం పొందుతున్న నటిని. గతంలో ఈ సీరియల్ ప్రేక్షకాదరణతో పాటు- రేటింగ్ పరంగానూ టాప్ స్థాయిలో ఉండేది. అలాంటప్పుడు నటీ-నటు-లకు కావలసిన మేర పారితోషికం అందించడం సహజం. మేము కాంట్రాక్టర్లతో మాట్లాడుకోని ఒప్పందాలు చేసుకుంటాం. నేను యూనియన్ సభ్యురాలిని కాబట్టి, నాకు కూడా ఒక నంబర్ ఉంటుంది. దాని ఆధారంగా పారితోషికం తీసుకుంటాను. నేను ఇతర నటీనటులను ఓడించానని చెప్పవచ్చు. అందుకే నన్ను చూసి చాలా మంది స్ఫూర్తి పొందుతారు. ఇది కేవలం నటన మాత్రమే కాదు, ఓ బాధ్యత కూడా' అని తెలిపింది. కానీ ఎంత తీసుకుంటుందో నెంబర్ మాత్రం చెప్పలేదు.దాదాపు 25 సంవత్సరాల క్రితం 'క్యోంకీ సాస్ భీ కభీ బహు థీ' ధారావాహికలో తులసి పాత్ర ద్వారా స్మృతి ఇరానీ పాపులారిటీని అందుకున్నారు. 2000 జూలైలో ప్రారంభమైన ఈ సీరియల్ 2008 నవంబరు వరకూ విజయవంతంగా ప్రసారం అయింది. ఆ సమయంలో స్మృతి ఇరానీ తులసి పాత్రకు పలు అవార్డులు, విశేషాలాభాలు దక్కించుకున్నారు. ఇక ఇప్పుడు అదే సీరియల్‌కు రెండో భాగంగా 'క్యోంకీ సాస్ భీ కభీ బహు థీ 2' జియో సినిమా, స్టార్‌ప్లస్ ఛానెల్లలో ప్రసారం అవుతోంది. ఇక ఈ భారీ పారితోషికంతో స్మృతి ఇరానీ బుల్లితెరపై తన కీ రీ ఎంట్రీ-ని ఘనంగా సెలబ్రేట్ చేస్తున్నారు. అభిమానులు కూడా ఈ సీరియల్‌కు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# వార్-2..కూలీపై సర్వత్రా ఆసక్తి

## హీరోల ఎంట్రీపై ఉత్కంఠ కలిగించేలా మేకింగ్





**టాకీస్:** ఎన్టీఆర్ వార్-2. రజనీకాంత్ కూలీ చిత్రాలపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ రెండూపోటీగా విడుదలవుతున్నాయి. సినిమా స్టార్ కాగానే హీరో కనిపించే విధానానికి చెక్ పెట్టేస్తున్నారు మేకర్స్. గతంలో ఓ స్పెషల్ సాంగ్ లేదా ఓ చిన్న ఎలివేషన్లతో హీరో ఎంట్రీ ఉండేది. కానీ ఇప్పుడు మాత్రం మినిమం అరగంట గ్యాప్ ఉండాల్సిందే. ఈ మధ్య సలార్, కల్కిలో అరగంట తర్వాతే యంగ్ రెబల్ స్టార్ దర్శన భాగ్యం లభించింది.. జస్ట్ కటౌట్ కనిపిస్తే చాలు అనుకుంటు-న్న ఫ్యాన్స్. ఈ గ్యాప్ పెద్దగా లెక్క చేయడం లేదు. ఇప్పుడు కూలీ, వార్ 2లో రజనీకాంత్, జూనియర్ ఎంట్రీ- కూడా ఇలాగే ఎ÷-లాన్ చేసినట్లు- టాక్ నడుస్తోంది. కూలీలో రజనీకాంత్ స్క్రీన్ పై కనిపించేది మూవీ స్టార్ట్ అయిన గంట తర్వాత అన్నది బజ్ నడుస్తోంది. ఈ గంటలోనే మిగిలిన క్యారెక్టర్లన్నింటినీ చూపించబోతున్నాడట లోకేశ్ కనగరాజ్. అటు- బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమౌతున్న తారక్ కూడా -టైటిల్ కార్డ్స్ పడిన అరగంట తర్వాతే కనిపించబోతున్నాడట. వార్ 2లో హృతిక్- తారక్ ఫేస్ ఆఫ్ అండ్ సాంగ్ స్క్రీన్ తగలబడి పోతాయంటున్నారు బాలీవుడ్ క్రిటిక్స్. ఇలా హీరోలను సినిమా స్టార్టయిన అరగంటకు, గంటకు చూపించి ప్రేక్షకుడికి అటెన్షన్ క్రియేట్ చేస్తున్నారు మేకర్స్. ఏదేమైనా తమ ఫేవరేట్ హీరోల కోసం ఎంత సేపైనా వెయిట్ చేసేందుకు రెడీగానే ఉన్నారు డై హార్ట్ ఫ్యాన్స్. రెండు హై ఆక్టేన్ మూవీస్ కూలీ, వార్ 2 బాక్సాఫీస్ దగ్గర బిగ్గెస్ట్ వార్‌కు రెడీ అవుతున్నా యి. రెండూ తెలుగు సినిమాలు కాదు కానీ అలా అని పొరుగు సినిమాలనీ తీసేయలేం. ఎందుకంటే ఇద్దరు టాలీవుడ్ బిగ్గెస్ట్ స్టార్ హీరోలు నాగార్జున, జూనియర్ ఎన్టీఆర్ ఈ చిత్రాల్లో భాగం కాబోతు న్నారు. సో మన సినిమాలుగా రిసీవ్ చేసుకుంటున్నారు టాలీవుడ్ ఆడియన్స్. మరి ఆగస్టు 14న ఏ సినిమా హిట్ టాక్ తెచుకుంటుందో బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ సౌండ్ చేస్తుందో లెట్స్ వెయిట్.

# లారెన్స్ బ్రదర్స్ బుల్లెట్ బండి




**టాకీస్:** ట్యాలెంట్ పవర్‌హౌస్‌గా పేరుగాంచిన రాఘవ లారెన్స్, ఆయన తమ్ముడు ఎల్విన్ కలిసి లీడ్ రోల్స్‌లో నటించిన తాజా చిత్రం 'బుల్లెట్టు- బండి'. మిస్టరీ, క్రైమ్, యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి తమిళ చిత్రం డైరీ ఫేం దర్శకుడు ఇన్నాసి పాండియన్ దర్శకత్వం వహించారు. ఫైవ్ స్టార్ క్రియేషన్స్ బ్యానర్‌పై కతిరేసన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో, తెలుగు అమ్మాయి వైశాలి రాజ్ హీరోయిన్‌గా నటిస్తోంది. తాజాగా సినిమా మేకర్స్ శుక్రవారం టీజర్‌ను విడుదల చేశారు. టీజర్ చూస్తుంటే మొదటి షాట్ నుంచే కథలోకి లాగేసే రీతిలో కట్ చేయబడింది. విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు అద్భుతంగా ఉండగా, శ్యామ్ సిఎస్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ టీ-జర్ మొత్తానికి ప్రధాన హైలైట్‌గా నిలిచింది.

గతేడాది 'జిగర్తాండా డబుల్ ఎక్స్' సినిమాతో మంచి విజయాన్ని సాధించిన లారెన్స్, ఈ చిత్రంతో కూడా హిట్ కొట్టడం ఖాయమనే హైప్ క్రియేట్ అయ్యింది. మరో విశేషం ఏమిటంటే, రియల్ స్టార్, స్వర్గీయ శ్రీహరి భార్య డిస్కో శాంతి ఈ మూవీతో చాలాకాలం తర్వాత రీ-ఎంట్రీ- ఇస్తున్నారు. అలాగే టాలీవుడ్ కమెడియన్ సునీల్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు, అయితే అతని డబ్బింగ్ కొంచెం భిన్నంగా అనిపిస్తోంది. మొత్తానికి మంచి బజ్ క్రియేట్ చేసింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.